


నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
ఆదివారం
31-05-2026 సంపుటి : 01 సంచిక : 69 పేజీలు: 08 వెల :₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI™
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

## మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో
# పోటీచేయను

### ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పుకుంటా

- లేకుంటే బిఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పకుంటుందా
- రైతుల ముసుగులో లబ్ధికి కేసీఆర్ రాజకీయ ఎత్తుగడలు
- ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బిజెపి ఎంపిల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- హరీష్ రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మే 30 (మహాప్రభ )
: తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మిటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ది కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం

-మిగతా 3 లో



## అధికారంలోకి రాగానే.. 111 జీవో ఎత్తివేస్తాం

- రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ముంచిన గుంపు మేస్త్రీ
- సర్కార్‌పై పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

రంగారెడ్డి మే 30 (మహాప్రభ )
చేవెళ్ల నియోజక వర్గానికి శాపంగా మారిన 111 జీవోను టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే పూర్తిగా ఎత్తివేస్తామని ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. జీవో ఎత్తివేస్తామని ఎన్నో ప్రభుత్వాలు హామీ ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు. మొయినాబాద్‌లో శనివారం తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరించిన కవిత కార్యక్రమానికి కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 111 జీవో ఎప్పటి నుంచో ఉన్న సమస్య, దీనిని రద్దు చేయాల్సింది పోయి జటిలం చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవో ఎత్తివేసి ఈ ప్రాంత ప్రజలకు పూర్తిగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా మనం పుట్టుకొచ్చామని తెలిపారు.

-మిగతా 3 లో



## బలహీన బాల భారతం!

- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 గణాంకాలు వెల్లడి
- ఇప్పటికీ 31.8 శాతం పిల్లల్లో పోషకాహార లోపం
- 40 శాతం పెద్దల్లో ఊబకాయం, మధుమేహం

న్యూఢిల్లీ మే 30 (మహాప్రభ )
భారతదేశం పోషకాహార లోపంలో ఏ స్థాయిలో ఉన్నదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 కండ్ల ముందుంచింది. డబుల్ ఇంజిన్ సర్కార్ అని, డిజిటల్ ఇండియా అంటూ గొప్పలు చెప్పుకుంటున్న మోదీ ప్రభుత్వమే దేశంలో ఇంకా 31.8 శాతం మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధ పడుతున్నారని అధికారికంగా తెలిపింది. శుక్రవారం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది.

-మిగతా 3 లో

## హార్ముజ్ నిర్వహణ హక్కు మాదే



- అమెరికాతో ఇంకా ఒప్పందమేదీ ఖరారు కాలేదు :ఇరాన్ వెల్లడి
- యూఎస్ అధ్యక్షుడి నోట నిజాల కన్నా అబద్ధాలే ఎక్కువ
- హార్ముజ్ నిర్వహణ హక్కు మాదే !
- అమెరికాతో ఇంకా ఒప్పందమేదీ ఖరారు కాలేదు! : ఇరాన్ వెల్లడి
- యూఎస్ అధ్యక్షుడి నోట నిజాల కన్నా అబద్ధాలే ఎక్కువ

టెహ్రాన్/వాషింగ్టన్ మే 30 (మహాప్రభ )
హార్ముజ్ జలసంధిని బేషరతుగా తెరిచేందుకు ఇరాన్ అంగీకరిం చిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను టెహ్రాన్ తోసి పుచ్చింది. తాను సమీక్షిస్తున్న ముసాయిదా ఒప్పందంలో అలాంటి అంశమేదీ లేదని స్పష్టం చేసింది. ట్రంప్ చెప్పే విషయాలలో కొన్ని వాస్తవాలు, మరికొన్ని అబద్ధాలు ఉన్నాయని తెలిపింది. ట్రంప్ వ్యాఖ్యలు 'కల్పిత విజయాన్ని చిత్రించేలా' ఉన్నాయని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) అనుబంధ ఫార్స్ న్యూస్ ఎద్దేవా చేసింది. నిర్ణయం ఏదీ తీసుకోనప్పటికీ ప్రతిపాదిత ఒప్పందం ఇరాన్ తుది అనుమతి కోసం ఎదురు చూస్తోందని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆ వార్తా సంస్థ తెలియజేసింది.

-మిగతా 3లో

## బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అరెస్ట్

- సింగరేణిపై.. అనుచిత వ్యాఖ్యలు
- తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్
- పోలీసులను అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు






## ఒక కుటుంబానికి ఒకే గ్యాస్ కనెక్షన్..

- జూన్ 1 నుంచి కొత్త నిబంధనలు అమలు
- బహుళ కనెక్షన్లు కలిగి ఉండటం చట్ట విరుద్ధం
- అదనపు సిలిండర్లను అప్పగించాల్సిందే
- ఒకటి కన్నా ఎక్కువ గ్యాస్ కనెక్షన్లు ఉన్న కుటుంబాలకు కేంద్రం షాక్

న్యూఢిల్లీమే 30 (మహాప్రభ )
ఒకే ఇంటిలో ఒకటి కన్నా ఎక్కువ గ్యాస్ కనెక్షన్లు ఉన్న కుటుంబాలకు కేంద్రం షాకిచ్చింది. పశ్చిమాసియా యుద్ధ సంక్షోభం, హొర్ముజ్ జలసంధి వద్ద ఏర్పడిన ప్రతిష్ఠంభనతో ఎల్పీజీ దిగుమతి గణనీయంగా తగ్గిపోయిన క్రమంలో గ్యాస్ వినియోగాన్ని నియంత్రించడానికి ఒక కుటుంబానికి ఒకటే గ్యాస్ కనెక్షన్ నిబంధన అమలుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధనలు జూన్ 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించింది. ఒకే ఇంటిలో ఒకటి కన్నా ఎక్కువగా బహుళ గ్యాస్ కనెక్షన్లు ఉంటే అది చట్ట విరుద్ధమని పేర్కొన్నది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆయిల్ మార్కెటింగ్ సంస్థలైన ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్, భారత్ పెట్రోలియం గ్యాస్ వినియోగదారులను ఉద్దేశించి ఉమ్మడి ప్రకటన చేశాయి.నూతన నిబంధనలను అనుసరించి వినియోగదారులు

-మిగతా 3 లో

## సీఎం రేవంత్.. జిల్లాల టూర్

### జూన్ 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్త పర్యటనలు



- ఒకటో తేదీన అదిలాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం
- 3న కోహెడలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు భూమి పూజ
- 4న నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పనులు పరిశీలన
- 5న హైదరాబాద్‌లో మహిళా సంఘాలకు బస్సులు పంపిణీ

హైదరాబాద్, మే 30 (మహాప్రభ )
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అలాగే బహిరంగ సభలు నిర్వహించనున్నారు.ఈ మేరకు జూన్ 1న అదిలాబాద్‌కు సీఎం రేవంత్ రెడ్డి రానున్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. 3న రంగారెడ్డి జిల్లా కోహెడలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు.

-మిగతా 3 లో

## కర్నాటక సీఎంగా డీకే శివకుమార్

- ప్రకటించిన కేపీసీసీ
- జూన్ 3న ప్రమాణస్వీకారం



బెంగళూరు మే 30 (మహాప్రభ )
కర్నా టక తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పగ్గాలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సీఎం సిద్దరామయ్య డీకే పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా సమర్థించారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్

-మిగతా 3 లో



## దేశానికి "ధర్మ హింస" అవసరమే..

- దేశం, సమాజానికి ముప్పుగా మారితే హింస అవసరం
- యూపీ సీఎం యోగి సంచలన వ్యాఖ్యలు
- ధర్మరక్షణ కోసం బలప్రయోగం సమర్థనీయం
- అందుకోసమే బలమైన దేశాలతోనే ప్రపంచం స్నేహం

లక్నో: మే 30 (మహాప్రభ )
ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దేశ భద్రత, అహింస, ధర్మరక్షణ అంశాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతలో అహింసకు అత్యున్నత స్థానం ఉన్నప్పటికీ, దేశం లేదా సమాజం ప్రమాదంలో పడినప్పుడు కేవలం అహింసతోనే సమస్యలను పరిష్కరించడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మాన్ని కాపాడటానికి అవసరమైతే బలప్రయోగం కూడా సమర్థనీయమని ఆయన స్పష్టం చేశారు. యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ అహింస అనేది మానవాళికి పరమ ధర్మమని పేర్కొన్నారు. శాంతి, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలు సమాజ నిర్మాణానికి ఎంతో అవసరమని అన్నారు. అయితే ఈ విలువలని దుర్వినియోగం చేస్తూ దేశ భద్రత లేద సమాజ శాంతి భంగం కలిగించే శక్తులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చోలేదని చెప్పారు. అలాంటి సందర్భాల్లో ధర్మాన్ని రక్షించడానికి కఠిన చర్యలు తీసుకోవడం అనివార్యమని పేర్కొన్నారు

-మిగతా 3 లో



## మోసపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- కాంగ్రెస్ పాలనలో రైతులు మోసపోయారు
- బిజెపి ప్రజల్లోకి వెళితే తప్ప ప్రభుత్వం మేల్కోలేదు
- కేంద్రాన్ని విమర్శించడం తప్ప చేసిందేమీ లేదు
- మీడియా సమావేశంలో మండిపడ్డ కిషన్ రెడ్డి

హైదరాబాద్, మే 30 (మహాప్రభ )
మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా దళారులు, ప్రభుత్వం, రైస్ మిల్లర్ల చేతిలో రైతులు విలవిల్లాడుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం చేతకాని తనం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మంత్రులు ఏసీ రూముల్లో గడిపారని.. తమ ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతుల దగ్గరికి వెళ్ళే వరకు

-మిగతా 3 లో

## ఒక్క ఏడాది ఆగండి..కాంగ్రెస్‌కు మిత్తితో చెల్లిద్దాం



- నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ లేదు
- రేవంత్ రెడ్డి, రాహుల్ కు గుణపాఠం చెప్పాలి
- సర్‌పై బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి కేటీఆర్ అవగాహన

ముషీరాబాద్ మే 30 (మహాప్రభ )
డిక్లరేషన్ల పేరుతో అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ పాలకులను యువత నిలదీయాలని బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జీహెచ్ఎంసీ పరిధిలో కొత్తగా ఒక్క

-మిగతా 3 లో

# రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం..


### -తీవ్రంగా ఇబ్బందిపడ్డ జనం..!



**న్యూఢిల్లీ మే 30 ( మహాప్రభ )**
రాజస్థాన్ లో ఇసుక తుపాను బీభత్సం సృష్టించింది. రాష్ట్రంలోని చురు, శ్రీగంగానగర్, బికనీర్, సీకర్ తదితర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం భీకర గాలులు వణికించాయి. దట్టమైన మేఘాల రూపంలో ఇసుక ఆవరించడంతో ఒక్కసారిగా చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. అనంతరం ఆయా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఇసుక తుపాను కారణంగా వాహనదారులు, స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దట్టమైన ఇసుక తుపానుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియా లో వైరల్‌గా మారాయి.అంతకుముందు.. జైపూర్‌లోనూ శుక్రవారం ఇదే విధమైన వాతావరణం కనిపించింది. ఇసుక తుపానుతోపాటు భీకర గాలులు వీచాయి. ధోల్‌పూర్ జిల్లాలో అత్యధికంగా 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో ఈ తరహా వాతావరణం మరో నాలుగైదు రోజులు కొనసాగే అవకాశం ఉందని జైపూర్‌లోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. జైపూర్, అజ్మీర్, బికనీర్, కోటా, జోధ్‌పూర్, ఉదయ్‌పూర్ డివిజన్లలో గంటకు 60-70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలు వీయడంతోపాటు ఆయా చోట్ల ఉరుములతో కూడిన వర్షంపడే అవకాశం ఉందని తెలిపింది.

# పతంజలి ఉత్పత్తులకు మహారాష్ట్ర ఎఫ్‌డీఏ షాక్..


### భారీగా మెడిసిన్స్ సీజ్..!




**న్యూఢిల్లీ మే 30 ( మహాప్రభ )**
ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్ కు చెందిన పతంజలి బ్రాండ్ ఉత్పత్తులకు మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ షాకిచ్చింది. నివారణ అంటూ తప్పుదోవ పట్టించే, అభ్యంతరకరమైన ప్రకటనలు ఇస్తున్నారన్న ఆరోపణలతో ఎఫ్‌డీఏ రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహించి భారీగా మందులను స్వాధీనం చేసుకుంది. సీజ్ చేసిన ఆయుర్వేద (గూఎతీజవఖు), అల్లోపతి మందుల విలువ సుమారు రూ.73.24 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఈ మందుల్లో పతంజలి బ్రాండ్‌తో విక్రయిస్తున్న ఉత్పత్తులు కూడా ఉన్నాయి.డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకరమైన ప్రకటనలు) చట్టం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు ఎఫ్‌డీఏ వెల్లడించింది. ముంబై, కొంకణ్, పుణె, నాసిక్, అమరావతి, నాగ్‌పూర్, ఛత్రపతి శంభాజీనగర్ డివిజన్లలో ఏకకాలంలో ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పతంజలి బ్రాండ్ కింద మార్కెటింగ్ చేస్తున్న, హరిద్వార్‌లోని దివ్య ఫార్మసీ తయారు చేసిన మందులను కూడా పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా నాగ్‌పూర్ డివిజన్‌లో రూ.7,26,755 విలువైన మందులను, నాసిక్ డివిజన్‌లో రూ.7,10,945 విలువైన స్టాక్‌ను సీజ్ చేసినట్లు అధికారులు వివరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని ఎఫ్‌డీఏ స్పష్టంచేసింది.

# యూపీ విద్యుత్ వినియోగదారులకు షాక్..


### - పది శాతం పెరుగనున్న కరెంట్ బిల్లులు



**న్యూఢిల్లీ మే 30 ( మహాప్రభ )**
ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ ధరలు పెంచింది. ఇంధన సర్దుబాటు ఛార్జీ విధానం కింద అదనపు సర్‌ఛార్జ్ విధించాలని ఉత్తర ప్రదేశ్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్ణయించింది. దీంతో జూన్ నెల నుంచి కరెంట్ బిల్లులు పది శాతం మేర పెరుగనున్నాయి. విద్యుత్ పంపిణీ సంస్థలకు పెరిగిన ఇంధనం, విద్యుత్ కొనుగోలు ఖర్చులను భర్తీ చేయడానికి అదనపు సర్‌ఛార్జ్ విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఇంధన సర్దుబాటు ఛార్జ్ విధానం ద్వారా ఇంధన ఖర్చులు, విద్యుత్ కొనుగోలు వ్యయాలలో వచ్చే హెచ్చుతగ్గులను వినియోగదారుల నుంచి తిరిగి రాబట్టుకోనున్నట్లు వివరించారు కాగా, ఇంధన సర్దుబాటు ఛార్జీ విధానం కింద అదనపు సర్‌ఛార్జ్ విధించనుండటంతో ఉత్తర ప్రదేశ్‌లోని విద్యుత్ వినియోగదారులు అధిక విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో జూన్ నెల నుంచి కరెంట్ బిల్లులు సుమారు పది శాతం మేర పెరుగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులపై ఆర్థిక భారం పడనున్నది.

# విద్యా వ్యవస్థను మోదీ నాశనం చేశారు

### ఒక్క పరీక్షను నిజాయితీగా నిర్వహించలేదు..



**న్యూఢిల్లీ మే 30 ( మహాప్రభ )**
ఒక్క పరీక్ష కూడా నిజాయితీగా నిర్వహించలేదని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'సమస్త విద్యా వ్యవస్థను' పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. శనివారం దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణలో ఆలస్యం జరిగింది. రాహుల్ గాంధీ దీనిపై స్పందించారు. 'నీట్, సీబీఎస్ఈ, ఎస్ఎస్‌సీ, ఇప్పుడు క్యూట్. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. ఒక్క పరీక్ష కూడా నిజాయితీగా నిర్వహించలేదు' అని విమర్శించారు. 'విశ్వగురు' అనే వాదనలను సవాల్ చేశారు. ప్రధాని మోదీ సమస్త విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. 'మీరు ఏ తరం భవిష్యత్తును నాశనం చేస్తున్నారో, అదే తరం మిమ్మల్ని జవాబుదారీగా నిలబెడుతుంది' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.కాగా, సీయూఈటీ ఆలస్యం జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో మరో వైఫల్యమని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకురాలు, ఢిల్లీ మాజీ సీఎం అతిషి విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మరోవైపు ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కూడా దీనిపై స్పందించారు. అతిషి పోస్ట్‌ను ఆయన షేర్ చేశారు. 'దేశానికి విద్యావంతుడైన ప్రధాని కావాలి' అని వ్యాఖ్యానించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రకారం ప్రధాని మోదీకి మాస్టర్స్ డిగ్రీ ఉన్నదని ఎద్దేవా చేశారు. అలాగే జాతీయ స్థాయి పరీక్షల్లో పదే పదే జరుగుతున్న సంస్థాగత వైఫల్యాలపై ప్రధాని మోదీ మౌనం వీడాలని ప్రతిపక్షాలు కోరాయి. విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.

# సిజేరియన్ ఆపరేషన్లలో తెలంగాణ టాప్..

### జాతీయ ఆరోగ్య శాఖ ఆందోళనకర రిపోర్టు



**న్యూఢిల్లీ మే 30 ( మహాప్రభ )**
తెలంగాణలో ఆందోళనకర రీతిలో సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి అనేక ఆరోగ్య సూచీల్లో తెలంగాణ ఉత్తమ ప్రదర్శన ఇస్తున్నా.. సీ సెక్షన్ ఆపరేషన్లు మాత్రం కలవరపరుస్తున్నాయి. దేశవ్యాప్తంగా సిజేరియన్ ఆపరేషన్ల సంఖ్య తెలంగాణలోనే ఎక్కువగా ఉననది. ఇక్కడ జరుగుతున్న పది డెలివరీల్లో.. ఆరుగురికి ఆపరేషన్ జరుగుతున్నట్లు నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ఫలితాల ద్వారా వెల్లడైంది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆ గణాంకాలను రిలీజ్ చేసింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 98.8 శాతం ప్రసూతీ కేసులు ఆస్పిటళ్లలోనే జరుగుతున్నాయని, ఇది జాతీయ సగటు 90.6 శాతం కన్నా ఎక్కువే అని, కానీ 62. 2 శాతం డెలివరీలు మాత్రం సిజేరియన్ సెక్షన్ ద్వారా జరుగుతున్నట్లు ఆరోగ్య శాఖ పేర్కొన్నది. ఇది జాతీయ సగటు 27.2 శాతం కన్నా రెట్టింపు అని ఆరోగ్య శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 ఆరోగ్య సర్వే సమయంలో తెలంగాణలో సిజేరియన్ ఆపరేషన్ల సంఖ్య 607 శాతంగా ఉంది. 2019 నుంచి 2021 మధ్య కాలంలో ఆ సర్వే జరిగింది. అయితే గత సర్వేకు.. తాజా సర్వేతో పోలిస్తే, కేవలం తెలంగాణలో మాత్రమే సిజేరియన్ల సంఖ్య రెట్టింపు అయ్యింది. మరే రాష్ట్రంలో కానీ, కేంద్ర పాలిత ప్రాంతంలో కానీ ఈ సంఖ్య పెరగలేదు. ఆంధ్రప్రదేశ్‌లో సిజేరియన్ల సంఖ్య 52.2 శాతంగా ఉంది. ఇక నాగాలాండ్‌లో అత్యల్పంగా 13.2 శాతంగా ఉన్నట్లు ఆరోగ్య శాఖ పేర్కొన్నది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న ఆపరేషన్ల గురించి కూడా సర్వేలో వెల్లడించారు. తెలంగాణలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో 83.9 శాతం డెలివరీలు సిజేరియన్ పద్ధతుల్లో జరుగుతున్నాయని, ఇక జాతీయ సగటు కేవలం 54.1 శాతం మాత్రమే ఉన్నట్లు ఆరోగ్య శాఖ చెప్పింది. తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా 48.1 శాతం సిజేరియన్ రేట్ ఉన్నట్లు పేర్కొన్నది. ఇక జాతీయ సగటు 16.9 శాతం మాత్రమే. ప్రెగ్నెన్సీ వచ్చిన మొదటి 100 రోజుల వరకు తెలంగాణలోని 81 శాతం మంది గర్భిణులు ఐరన్, ఫోలిక్ యాసిడ్ ట్యాబ్‌లెట్లు వాడినట్లు రిపోర్టులో తెలిపారు. ఇక జాతీయ సగటు కేవలం 54.9 శాతం మాత్రమే ఉంది.

# మిస్సైల్ కేంద్రాల వద్ద లాంచ్ ప్యాడ్లు నిర్మిస్తున్న చైనా..

### కొత్త శాటిలైట్ పిక్స్ రిలీజ్



**బీజింగ్ మే 30 ( మహాప్రభ )**
చైనాలోని ఎడారి ప్రాంతం ఉయ్‌గర్‌లో ఉన్న న్యూక్లియర్ ప్లాంట్ వద్ద భారీగా నిర్మాణాలు జరుగుతున్నాయి. జిన్‌జియాంగ్‌లో ఉన్న మిలిటరీ కాంప్లెక్స్ వద్ద .. చైనా తాజాగా ఆ నిర్మాణాలు చేపట్టింది. న్యూక్లియర్ మిస్సైళ్లకు చెందిన ల్యాంచ్ ప్యాడ్లను తయారు చేస్తోందని భావిస్తున్నారు. అమెరికాలోని ఏ నగరాన్నైనా చేరుకునే సామర్థ్యం కలిగిన అణు క్షిపణులు చైనా వద్ద ఉన్న విషయం తెలిసిందే. అయితే తాజాగా రిలీజైన శాటిలైట్ ఫోటోలు చైనా ఆయుధ శక్తిని చాటుతున్నాయి. న్యూక్లియర్ ఆయుధాలను దాచిపెట్టే స్థావరాల వద్ద భారీ స్థాయిలో ల్యాంచ్ ప్యాడ్లు, బంకర్లు, కమ్యూనికేషన్ కేంద్రాలు నిర్మిస్తున్నట్లు ఆ శాటిలైట్ చిత్రాల ద్వారా తెలిసింది. అతి సుదీర్ఘ దూరం ప్రయాణించే క్షిపణులు ఆ కేంద్రం వద్ద ఉన్నట్లు తెలుస్తోంది.ఉయ్‌గర్ మిలిటరీ కేంద్రం వద్ద సుమారు 80 ల్యాంచ్ ప్యాడ్లను చైనా నిర్మిస్తున్నది. మొబైల్ మిస్సైల్ లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీ దళాల సంఖ్యను పెంచుకుంటోంది. రాయిటర్స్ సంస్థ రిలీజ్ చేసిన దృశ్యాల ప్రకారం ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, శాటిలైట్ కమ్యూనికేషన్స్, కమాండ్ ఆపరేషన్స్ సంబంధించిన కేంద్రాలను డెవలప్ చేస్తున్నట్లు తెలిసింది. గతంలో ఈ స్థాయిలో నిర్మాణాలు అక్కడ లేనట్లు పేర్కొన్నారు. కానీ ఒక్కసారిగా చైనా భారీ ఎత్తున న్యూక్లియర్ స్థావరాల వద్ద నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. న్యూక్లియర్ దళాల రక్షణ కోసం కొత్త తరహా నిర్మాణాలు చేపడుతున్నట్లు అంచనా వేస్తున్నారు. ఎడారి ప్రాంతంలోని కొన్ని వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మాణాలు జరుగుతున్నట్లు హవాయి పసిఫిక్ ఫోరమ్‌కు చెందిన అలెగ్జాండర్ నీల్ తెలిపారు. ఎడారి ప్రాంతంలో ఉన్న స్థావరాల రక్షణ కోసం ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు భావిస్తున్నారు. జిన్‌జియాంగ్ ప్రాంతం, ఘాన్సు ప్రావిన్సులో ఉన్న న్యూక్లియర్ ఫోర్స్ ఆ స్థావరాల రక్షణ బాధ్యతలు చేపడుతున్నది.

# దేశానికి విద్యావంతుడైన ప్రధాని అవసరం : కేజ్రీవాల్

**న్యూఢిల్లీ మే 30 ( మహాప్రభ )**



దేశానికి ఒక విద్యావంతుడైన ప్రధాని అవసరమని ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సియుఇటి-యుజి పరీక్షల్లో తలెత్తిన ఇబ్బందులపై ఆయన పై విధంగా స్పందించారు. దేశానికి ఒక విద్యావంతుడైన ప్రధాని అవసరమని, విద్యావ్యవస్థ మాఫియా చేతుల్లోకి వెళ్లిపోయిందని అన్నారు. నీట్ పరీక్షల్లో పేపర్ లీకేజీని అడ్డుకునేందుకు ఆర్మీ వాహనాలను వినియోగించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆయన మండిపడ్డారు. ఇది పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు కాదని, కేవలం ప్రదర్శన కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ వ్యాఖ్యలు చేసిందని మండిపడ్డారు. ఆర్మీ వాహనాలు ప్రశ్నాపత్రాల లీకేజీని అడ్డుకుంటాయా అని కేంద్రాన్ని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం నిరక్షరాస్యుల్లాగా వ్యవహరిస్తోందని అన్నారు. పేపర్ లీకేజీలను అడ్డుకునే ఉద్దేశ్యం మోడీ ప్రభుత్వానికి లేదని, విద్యావ్యవస్థ మాఫియా చేతుల్లోకి వెళ్లిపోయిందని అన్నారు. తన ఫిజిక్స్ పేపర్‌లో అవకతవకలపై ఆందోళన వ్యక్తం చేసిన 12వ తరగతి విద్యార్థి వేదాంత్ ఉదంతాన్ని కూడా కేజ్రీవాల్ ప్రస్తావించారు. బిజెపి ట్రోల్ సైన్యం వేదాంత్ ను ట్రోల్ చేసిందని, అతనిని పాకిస్తానీ అని, దేశద్రోహి అని పిలిచిందని, ఇదంతా విద్యను మాఫియాగా మార్చిన వ్యక్తులను కాపాడుకునేందుకేనని అన్నారు.

# నాగాలాండ్‌లో అరుదైన కప్ప జాతి గుర్తింపు

**న్యూఢిల్లీ మే 30 ( మహాప్రభ )**



భారతదేశ ఈశాన్య రాష్ట్రమైన నాగాలాండ్‌లో శాస్త్రవేత్తలు అరుదైన జాతికి చెందిన -జలపాత కప్ప' (క్యాస్కేడ్ కప్ప)ను గుర్తించారు. ప్రపంచానికి ఇటప్పటివరకు తెలియని ఈ వినూత్న కప్ప జాతిని నాగాలాండ్ పర్వత ప్రాంతాల్లోని ప్రవాహాలు, జలపాతాల వద్ద గుర్తించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. పర్వత ప్రాంతాల్లో వేగంగా ప్రవహించే నీటి ప్రవాహాల (జలపాతాల) మధ్య నివసించే విశిష్ట లక్షణం ఉన్నందున వీటికి జలపాత కప్పలు (క్యాస్కేడ్ కప్పలు) అని పేరు పెట్టారు. పర్యావరణ వైవిధ్యానికి నిలయమైన ఈశాన్య భారత ప్రాంతంలో, ముఖ్యంగా నాగాలాండ్ అడవులలో జీవవైవిధ్యంపై జరుగుతున్న పరిశోధనల్లో భాగంగా ఈ అరుదైన జీవి వెలుగుచూసిందని అన్నారు. ఈ కొత్త కప్ప జాతి గుర్తింపుతో ఈ ప్రాంతంలో ఉన్న వన్యప్రాణుల వైవిధ్యం, పర్యావరణ వ్యవస్థ ప్రాముఖ్యత మరోసారి నిరూపితమైందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ అరుదైన ఆవిష్కరణకు సంబంధించిన పూర్తి వివరాలను అంతర్జాతీయ సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. ఈ అరుదైన జీవులు మనుగడ సాగించాలంటే అవి నివసించే సహజ సిద్ధమైన జలవనరులను, అటవీ ప్రాంతాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పర్యావరణ వేత్తలు స్పష్టం చేశారు.

# అధికారంలోకి రాగానే.. 111 జీవో ఎత్తివేస్తాం



మొదటి తరువాయి

తెలంగాణ హక్కులను తెలంగాణ రక్షణ సేన పరిరక్షిస్తుందన్నారు. ఈ ప్రాంతంలో చూస్తే ఎకరాకు వంద కోట్ల రూపాయలు పలుకుతున్న పరిస్థితి మనం చూస్తున్నామని, 120 గ్రామాలకు సంబంధించి 111 జీవోను అమలులో ఉండుడునా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం ఒక పావు ఎకరం అమ్ముకున్నా మంచి ధర వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. గుంపు మేస్త్రీ నాకు రియల్ ఎస్టేట్ వ్యాపారమే బాగా తెలుసు అని గొప్పలు చెప్పుకుంటడు.. ఆ వ్యాపారాన్ని కూడా ఊడగొట్టిందని విమర్శించారు. ఎలాంటి గ్యారంటీ లేకుండా నిరుద్యోగులకు రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని కవిత హామీ ఇచ్చారు.

# బలహీన బాల భారతం!

మొదటి తరువాయి




దేశవ్యాప్తంగా 715 జిల్లాల్లో 6.79 లక్షల కుటుంబాలపై ఈ సర్వే నిర్వహించారు.

**పోషకాహార లోపం పెద్ద సవాల్..**

సర్వే ప్రకారం ఐదేళ్లలోపు ఉన్న 29.3 శాతం మంది పిల్లలు ఉండాల్సిన ఎత్తు కంటే తక్కువ ఉంటున్నారు. అంటే ప్రతి 10 మందిలో ముగ్గురు ఎత్తు సమస్యతో, 5.2 శాతం మంది శారీరక బలహీనతతో బాధపడుతున్నారు. అలాగే నవజాత శిశువులకు సగం మంది తల్లులు మాత్రమే పుట్టిన గంట లోపు పాలు పడుతున్నారు. పైగా 40.5 శాతం మంది పిల్లలకు తల్లిపాలతో అందాల్సిన సమతుల్య ఆహారం అందట్లేదు. వీటి కారణంగా పిల్లలు బలహీనంగా, ఎత్తు, బరువు తక్కువగా ఉంటున్నారు. పుట్టిన పిల్లల్లో ఇంకా 13 శాతం మందికి సరైన టీకాలే అందట్లేదు. మీజిల్స్ రెండో డోస్ టీకా కేవలం 71.8 మందికే అందుతున్నది.

ఈ సర్వేలో ప్రతి పది మందిలో నలుగురు అధిక బరువుతో బాధ పడుతున్నారు. సుమారు 40 శాతం పెద్ద వయసు పురుషులు, మహిళలు అధిక బరువు, ఊబకాయంతో ఉన్నారు. 18 శాతం మంది మహిళలు, 20 శాతం మంది పురుషులు ప్రస్తుతం షుగర్ వ్యాధితో బాధ పడుతున్నారు. కుటుంబాలకు అందే బీమా కవరేజీ మాత్రం 41% నుంచి 60.2% కి పెరిగింది. 90 శాతం ప్రసవాలు దవాఖానల్లో జరుగుతుంటే ఇంకా 10 శాతం బయటి ప్రాంతాల్లోనే జరగడం గమనార్హం.

# ఒక కుటుంబానికి ఒకే గ్యాస్ కనెక్షన్..

తమ వద్ద అదనంగా ఉన్న గ్యాస్ సిలిండర్లను వెంటనే అప్పగించాలని విజ్ఞప్తి చేశాయి. ఒక వంట గదితో ఉండే ఒక కుటుంబం (భర్త, భార్య, పెళ్లయిన పిల్లలు, తల్లిదండ్రులు)కు ఒక్క ఎల్పీజీ కనెక్షన్‌ను మాత్రమే అనుమతిస్తారు. అంతే కాకుండా అదనపు సిలిండర్లను కనుక కంపెనీలకు అప్పగించకపోతే వారి అసలు కనెక్షన్‌కు కూడా గ్యాస్ సరఫరా నిలిపివేస్తారు. సిలిండర్లను అప్పగించిన తర్వాతే సరఫరాను పునరుద్ధరిస్తారు. అయితే అదనపు సిలిండర్‌ను తిరిగి అప్పగించిన తర్వాత వినియోగదారులు ఒక బ్యాకప్ సిలిండర్ కోసం డబుల్ బాటిల్ కనెక్షన్‌గా మార్చుకోవడాన్ని ఎంచుకోవచ్చు. ఒక వేళ వినియోగదారులు పీఎన్‌జీ కనెక్షన్‌ను కనుక పొందదలిస్తే తమ ఎల్పీజీ కనెక్షన్‌ను 30 రోజుల్లోగా అప్పగించాలి. ప్రత్యామ్నాయంగా వారు బదిలీ వోచర్‌ను అభ్యర్థించ వచ్చు. దీని ద్వారా పీఎన్‌జీ అందుబాటులో లేని ప్రాంతంలో ఎల్పీజీ కనెక్షన్‌ను తిరిగి క్రియాశీలం చేయడం సాధ్యమవుతుంది. గ్యాస్ వినియోగాన్ని నియంత్రించడానికి, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్రం ప్రకటించింది.

# హార్ముజ్ నిర్వహణ హక్కు మాదే

మొదటి తరువాయి

**ట్రంప్ ఏమన్నారంటే...**

పశ్చిమాసియా ఘర్షణపై శ్వేతసౌధంలో జరిగిన కీలక సమావేశానికి హాజరయ్యే ముందు ట్రంప్ మాట్లాడుతూ హార్ముజ్‌లో నౌకల రాకపోకలపై విధించిన ఆంక్షలు తొలగిపోయాయని చెప్పారు. ఆ జలసంధిలో సముద్ర రవాణా సాధారణ స్థితికి చేరుతోందని తెలిపారు. 'హార్ముజ్‌లో మిగిలిపోయిన మందుపాతరలను తక్షణమే ఇరాన్ తొలగిస్తుంది. అవి అక్కడ పెద్దగా లేకపోవచ్చు. మా అసాధారణ నౌకా దిగ్బంధనం కారణంగా జలసంధిలో చిక్కుకుపోయిన నౌకలు స్వదేశాలకు తరలిపోతున్నాయి. మీ కుటుంబసభ్యులకు నా తరపున...మీ అభిమాన అధ్యక్షుడి తరపున హలో చెప్పండి' అంటూ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఆయన రాశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ హార్ముజ్‌లో నౌకల నుంచి ఇరాన్ ఎలాంటి రుసుము వసూలు చేయదని అన్నారు. అంతగా ప్రాధాన్యత లేని మిగిలిన అంశాలపై ఇరాన్‌తో అంగీకారం కుదిరిందని తెలిపారు.

ఇరాన్ ఏమంది?

ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ మీడియా తోసిపుచ్చింది. హార్ముజ్‌ను తిరిగి తెరిచే విషయంపై చేసుకునే ఒప్పందంలో నౌకల పర్యవేక్షణ'తనిఖీ, సేవల నిబంధనలు, భద్రతా చర్యలు విధిగా ఉంటాయని స్పష్టం చేసింది. రుసుములు, షరతులు లేకుండా హార్ముజ్‌ను తిరిగి తెరిచేందుకు ఇరాన్ అంగీకరించిందన్న వార్తలను ఖండిస్తూ ముసాయిదాలో అలాంటి క్లాజు ఏదీ లేదని తెలిపింది. ఇరాన్ నౌకల దిగ్బంధాన్ని ఎత్తివేస్తేనే హార్ముజ్‌ను టెహ్రాన్ తిరిగి తెరుస్తుందని మీడియా కథనాలు చెబుతున్నాయి. ఇరాన్ తన వద్ద ఉన్న అణు పదార్థాలను ధ్వంసం చేస్తుందంటూ ట్రంప్ చేస్తున్న వాదనలో నిజం లేదని కూడా ఫార్స్ న్యూస్ చెప్పింది. చర్చల దశలో ఉన్న అవగాహనా పత్రంలో అలాంటి అంశమే లేదని తెలిపింది. విదేశాలలో స్తంభింపజేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను తక్షణమే విడుదల చేయాలన్న డిమాండ్ ముసాయిదాలో కీలక భాగంగా ఉన్నదని టెహ్రాన్ అధికారులను ఉటంకిస్తూ ఆ వార్తా సంస్థ పేర్కొంది. నిధులను విడుదల చేయని పక్షంలో చర్చల తదుపరి దశకు ఇరాన్ కదలబోదని స్పష్టం చేసింది. హెజ్బొల్లాలు కోరుతున్న విధంగా లెబనాన్‌లో కూడా పూర్తిగా కాల్పుల విరమణను పాటించాలన్న డిమాండ్ కూడా చర్చలలో ఉన్నదని తెలిపింది.

# మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

మొదటి తరువాయి

రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోడీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ధి కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఎపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని,



సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధృాన్యం కొనకపోతే భాజపా నేతల

ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలన్నారు. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన దిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ సంస్థ. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం అదే ఇప్పుడు పేరు మార్చుకుందన్నారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

# బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అరెస్ట్

**-సింగరేణిపై.. అనుచిత వ్యాఖ్యలు**
**-తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్**
**-పోలీసులను అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు**

హైదరాబాద్,

సింగరేణి సంస్థపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఉండగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని నాంపల్లి కోర్టుకు తరలించారు. అంతకు ముందు బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు శనివారం ఉదయం తెలంగాణ భవన్ దగ్గరకు వెళ్లారు. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్ దగ్గర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ భవన్‌లో ఉన్న బాల్క సుమన్‌ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు. అనంతరం సుమన్‌ను అరెస్ట్ చేసి




పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పలు సెక్షన్ల కింద కేసులు

బాల్క సుమన్‌పై 326(g), 351(3), 353(1)(ఎ), r/w55, r/w 61(2)(a), ఎఅం 4 pdppa కింద కేసు నమోదైంది. ఆనంద్ అనే వ్యక్తి బాల్క సుమన్‌పై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. 'సింగరేణిని తగలపెట్టండి. మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. ఆఫీసులను తగలబెడదాం. నెల రోజులు జైలుకు పోయి వస్తాము' అని బాల్క సుమన్ కామెంట్ చేసినట్లు ఆనంద్ తెలిపాడు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు: బాల్క సుమన్

పోలీసులు అరెస్ట్ చేయడానికి ముందు బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. నేను ఎక్కడికీ పారిపోలేదు. తెలంగాణ భవన్‌లోనే ఉన్నా. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాపై 250కి పైగా కేసులు పెట్టారు. క్యాతనపల్లి ఎన్నిక సమయంలోనూ నన్ను జైల్లో పెట్టారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను టార్గెట్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. దానినే ప్రశ్నిచ్చా. మరోసారి నన్ను జైలుకు పంపాలని రేవంత్, వివేక్ ప్రయత్నిస్తున్నారు. నన్ను జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు.

# కర్నాటక సీఎంగా డీకే శివకుమార్

మొదటి తరువాయి

సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఏఐసీసీ పరిశీలకులు ప్రకటించారు. కాగా కేవలం పది నిమిషాల్లోనే సీఎల్పీ భేటీ ముగియడం గమనార్హం.

జూన్ 3న ప్రమాణ స్వీకారం

కర్నా టక కొత్త సీఎం డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారోత్సవం జూన్ 3న జరగనుంది. ఈ విషయాన్ని కర్నా టక కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జీసీ చంద్రశేఖర్ ప్రకటిం చారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం లోక్‌భవన్‌లో జరుగనుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిరాడంబరంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే సీఎం ప్రమాణస్వీకారోత్సవ వేదికను లోక్‌భవన్‌కు మార్చినట్టు చంద్రశేఖర్ తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తలెత్తకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు ఎవరు కూడా లోక్‌భవన్‌కు రావద్దన్నారు. పార్టీ నిర్ణయానికి అందరూ సహకరించాలని కోరారు.

గవర్నర్ తో డీకే భేటీ

లోక్‌భవన్‌లో శనివారం ఉదయం గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్‌తో డీకే శివకుమార్ భేటీ అయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపైనే వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. గవర్నర్ ఆదివారం ధర్మస్థలలో జరిగే ఉపరాష్ట్రపతి పర్యటనకు హాజరుకావాల్సి ఉన్న నేపథ్యంలో ఆయన బెంగళూరు వెళు న్నారు. గవర్నర్ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతోనే, సీఎల్పీ సమావేశానికి ముందే డీకే ఆయనతో భేటీ అయినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

# మోసపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

మొదటి తరువాయి

మేలుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం గతంలో ఎలా ఉండేదో ఇప్పుడు అలానే ఉందని విమర్శించారు. రైతుల దగ్గర నుంచి కేంద్రం నేరుగా కొనదు.. మీ దద్దమ్మ తనం కేంద్రం మీద మోపుతున్నారని మండిపడ్డారు. దొడ్డు బియ్యం పండించే రైతుల పరిస్థితి ఏందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రైతులతో ఆడుకుంటున్నాయని.. ఈ ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమిషన్లు, భూ దందాల మీద ఉన్న దృష్టి రైతుల మీద లేదని విమర్శించారు. ఆ మంత్రి ఎంత ఈ మంత్రి ఎంత కమిషన్ తీసుకున్నారు.. నేనెంత తీసుకోవాలని చర్చిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ వ్యాప్తంగా విపరీతంగా ధాన్యం ఉత్పత్తి జరిగిందని.. ఎక్కడ గోదాంలు ఖాళీగా లేవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 'విదేశాలకు సప్లై చేయాలి అంటే ఫెస్టిసైడ్ వాడ కూడదు. క్షేత్ర స్థాయిలో ఆర్గానిక్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పిస్తుందా? రైతుల ఉసురు తీసుకుంటుంది ఈ ప్రభుత్వం.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ సమస్య ఎందుకు లేదు. 6 నెలల ముందు గన్ని బస్తాలు తెచ్చుకుంటే ఏమయ్యింది. ఇక్కడ పండే సన్న బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తున్నారు. ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. తక్కువ ధరకు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ నాశి రకం సన్న బియ్యాన్ని పేద ప్రజలకి అందిస్తున్నారు. పేదలను, రైతులను మోసం చేస్తున్నారు. అందరికి కేంద్రాన్ని విమర్శించడం అలవాటు అయింది. ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణ నుంచి కేంద్రం తీసుకుంది. ఈ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని అనుకుంటుంది. ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రధాని పదేపదే చెపుతున్నారు. ధాన్యం సేకరణపై కేంద్రం గతంలో 9 సార్లు పొడిగింపు ఇచ్చింది. ఎప్పుడూ ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయలేదు. రైస్ మిల్లర్లతో కుమ్మక్కు అయ్యారు. గతంలో బీర్ఎస్ అదే పని చేసింది. కేంద్రం ఇప్పటి వరకు ఇచ్చిన కోటను పూర్తి చేయలేదు. 52.24 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రంతో ఒప్పందం జరిగింది. ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు.

# సీఎం రేవంత్.. జిల్లాల టూర్

ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. కాగా, తెలంగాణ ప్రభుత్వం కోహెడలో 239 ఎకరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో మార్కెట్‌ను నిర్మించింది. ఆ తర్వాత అదే రోజు మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్ పర్యటిస్తారు. రాత్రికి సోమశిలలో బస చేయనున్నారు. జూన్ 4న జూరాల, నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పనులను పరిశీలిస్తారు. నార్లాపూర్, వట్టెం, ఏదుల రిజర్వాయర్లను సందర్శించి పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించనున్నారు. జూన్ 5న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మహిళా సంఘాలకు బస్సులను రేవంత్ రెడ్డి పంపిణీ చేయనున్నారు. రూ.199 కోట్లతో కొనుగోలు చేసిన 553 బస్సులను మహిళలకు అందించనున్నారు. కాగా, మహిళా సంఘాలకు బస్సులు అందించి, వాటిని తెలంగాణ ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది.

# ఒక్క ఏడాది ఆగండి..కాంగ్రెస్‌కు మిత్తితో చెల్లిద్దాం

మొదటి తరువాయి

ఇల్లు కట్టకపోగా, హైడ్రాను తెచ్చి వేలాది ఇండ్లను కూలగొట్టారని ఆరోపించారు. ఒక్క ఏడాది కష్టపడండి చాలు కాంగ్రెస్ పాలకులకు మిత్తితో సహా చెల్లించే సమయం వస్తుందని వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ పట్ల పార్టీ కార్యకర్తలు అందరూ అప్రమత్తంగా ఉంటూ అర్హుల ఓట్లు పోకుండా చూడాలని చెప్పారు. ముషీరాబాద్ నియోజక వర్గ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శనివారం ఓ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ ప్రత్యేక ఓటర్ సవరణ, బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు పట్ల పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై రాహుల్ గాంధీనీ యువత నిలదీయాలన్నారు. తెలంగాణ యువతకు మా కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తే తిరిగి వచ్చి అండగా నిలబడతానని మాయమాటలు చెప్పిన రాహుల్ గాంధీ ఇప్పుడు ఎటు పోయారని ప్రశ్నించారు. పార్టీ తరఫున ఎంపిక చేసిన బీఎల్ఏలు ఏ ఒక్కరి ఓటు తొలగకుండా కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి అర్.ఎస్ ప్రవీణ్ కుమార్, పార్టీ నేతలు ఎమ్మెన్ శ్రీనివాస్, ముఠా జై సింహ, నాగేష్ ముదిరాజ్, ఎడ్ల హరిబాబు యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, బూత్ కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

# దేశానికి "ధర్మ హింస" అవసరమే..

మొదటి తరువాయి

. భారతీయ తత్త్వశాస్త్రంలో "అహింసా పరమో ధర్మః, ధర్మ హింసా తథైవ చ" అనే సూక్తిని యోగి ప్రస్తావించారు. దీని అర్థం అహింస గొప్ప ధర్మమే అయినప్పటికీ, ధర్మాన్ని కాపాడటానికి అవసరమైన హింస కూడా ధర్మమే అనే భావన. ఈ సిద్ధాంతాన్ని భారతీయ ఇతిహాసాలు, పురాణాలు కూడా ప్రతిపాదించాయని ఆయన అన్నారు. అన్యాయం, అధర్మం, దుర్మార్గాన్ని నిర్మూలించేందుకు అవసరమైన సందర్భాల్లో శక్తిని వినియోగించడం సమాజ ప్రయోజనాల దృష్ట్యా సమర్థనీయమని వివరించారు. దేశ భద్రత విషయంలో భారత సైన్యం, భద్రత బలగాల పాత్రను యోగి ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశ భద్రతను కాపాడటంతో పాటు అంతర్గత భద్రతను పరిరక్షించడంలో భద్రతా దళాలు చేస్తున్న త్యాగాలు అమూల్యమని అన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, దేశ వ్యతిరేక కార్యకలాపాలను ఎదుర్కొనే సమయంలో కేవలం శాంతి సందేశాలు సరిపోవని, అవసరమైన చర్యలు తీసుకోవాలనేదేనని పేర్కొన్నారు. యోగి వ్యాఖ్యలు భారతదేశ భద్రత విధానానికి సంబంధించిన విస్తృత చర్చ దారితీశాయి. ఒకవైపు శాంతి, అహింస వంటి విలువలను కాపాడటూనే, మరోవైపు దేశ ప్రయోజనాలకు ముప్పు కలిగించే శక్తులపై కఠిన వైఖరి అవలంబించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత సహజీవనం అత్యంత ముఖ్యమైనదే అయినప్పటికీ, దేశ సమగ్రత, ప్రజల భద్రత విషయంలో రాజీ పడకూడదనే సందేశాన్ని ఆయన ఇచ్చారు.

# సంపాదకీయం

## జనాభా కాదు.. మౌళిక వసతులు ఆలోచించండి !



దేశంలో ప్రస్తుతం ఉన్న జనాభాకే సరైన మౌళిక సదుపయాలు లేవు. విద్య,వైద్యం అందించే స్థితిలో ప్రభుత్వాలు లేవు. అలాగే నిత్యావసరాలు అందడం లేదు. ఉండడానికి ఇల్లు లేదు. దేశంలో అత్యధిక జనాభాకు కనీస గూడు కూడా కరువే. ఘనత వహించిన పాలకుల తీరు కారణంగా ప్రజలు నానా అగచాట్లు పడుతున్నా పాలకులకు పట్టింపు లేదు. ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా, వాటిని సకాలంలో సేకరించే యంత్రాంగం లేదు. ఉన్న జనాభాను పనులకు ఉపయోగించుకునే తెలివి లేకుండా పోయింది. ఇదంతా కూడా కేవలం వ్యవస్థాగత లోపంతో పాటు, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం, పరిపాలనానుభం లేకపోవడం ప్రధాన కారణంగా చూడాలి. ఇలాంటి సమయంలో ఈ మధ్య ఎపి సిఎం చంద్రబాబు పిల్లలను కనండి.. డబ్బులు పడేస్తాను అంటూ ప్రచారంతో ఊదరగొడుతున్నారు. తను ఒక్క కొడుకునే కన్నాడు. తన కొడుకు లోకేశ్ కూడా ఒక్క పిల్లాడిని కని మిన్నకున్నారు. చంద్రబాబు పిలుపు ఇంటికి పనికిరాదా అన్నది చెప్పాలి. కనీస మౌళిక వసతులు కల్పించేందుకు చంద్రబాబు పనిచేస్తున్నారా అన్నది చెప్పాలి. ఇవేవీ కల్పించ కుండా పిల్లలను కని పడేసతే వారికి తిండి,బట్ట, చదువుసంధ్యా, వైద్యం ఎవరు అందిస్తారో చెప్పాలి. ఇందుకు గ్యారెంటీ ఇవ్వగలరా అన్నది చెప్పాలి. ఇప్పుడున్న పిల్లలకు ఈ రకమైన వసతులు కల్పించడానికి ఏం చేస్తున్నారో చంద్రబాబుతో సహా పాలకులంతా ప్రకటించాలి. దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకుని వెళ్లే బదులు ఇలా తిరోగమనం వైపు తీసుకుని వెళ్లే యత్నంలో రాజకీయ కోణం తప్ప మరోటి లేదు. జనాభా నియంత్రణ లేకపోవడంతో దేశంపై ఎంతగా భారం పడుఉతందో చెప్పడం లేదు. ప్రజలు త్యాగాలు చేస్తుంటే... నాయకులు భోగాలు అనుభవిస్తున్నారు. కేవలం సీట్లు పెంచుకోవడం అన్న ధ్యాస తప్ప మరోటి లేదు. జనాభా పెరిగితే రేపటి అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో కోత ఉండదన్న దురుద్దేశం ఇందులో దాగి ఉందనడంలో సందేహం లేదు. దక్షిణాది రాష్ట్రాల జనాభా పెరుగుదల రేటు గణనీయంగా తగ్గిన కారణంగా నియోజక వర్గాల పునర్విభజన జరిగితే, నష్టపోతాం కనుక జనాభాను పెంచాల్సి ఉందని,అందుకు మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చంద్రబాబు నాయుడు సెలవిచ్చారు. ఎక్కడకు వెళ్లినా , కార్యక్రమం ఏదైనా జనాభా పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చబుతున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ మంది పిల్లలను కనే మహిళలకు, పిల్లలకు ప్రోత్సాహకాలను కూడా ప్రకటించారు. మూడవ సంతానానికి రూ.30 వేలు, నాల్గవ సంతానానికి రూ.40 వేలు నగదు సహాయం చేస్తామని, ఆర్థికాభివృద్ధి బాగుంటే మరింత ఎక్కువ ఇవ్వడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. అసలు ఈ పిల్లలను కనడానికి కనీసం ఆస్పత్రి సౌకర్యాలు లేని ఎన్నో గ్రామాలు ఉన్నాయి. ముందుగా ఆయా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా రావడం లేదు. ఎవరి ప్రయోజనాల కోసం మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలో చెప్పాలి. పిల్లను కనడం వల్ల వచ్చే సౌలభ్యం ఏమిటో చెప్పాలి. ఈ ప్రోత్సాహకాలు ప్రకటించడం ద్వారా గ్రామీణ మహిళల కుటుంబాల్లో డబ్బు కోసం ఒత్తిడి పెరుగుతోంది. ఈ విషయం చంద్రబాబు గ్రహించినట్లు లేదు.ప్రోత్సాహకాలు మాత్రమే మహిళలు ఆరోగ్యంగా, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి, పిల్లలు సురక్షితమైన వాతావరణంలో పెరగడానికి అవకాశాలు కల్పిస్తాయని భరోసా ఇవ్వగలరా అన్నది చెప్పాలి. కార్పొరేట్ సంస్థలకు చౌకగా శ్రామికులను సరఫరా చేయడానికి, మహిళలను ఇంటికి పరిమితం చేయడానికి మాత్రమే ఇది ఉపయోగ పడుతుంది. దేశ జనాభా ఇప్పటికే విపరీతంగా పెరిగింది. బాల్యం అంతా వెట్టిలో సాగుతోంది. జనాభా పెరుగుదల దేశంలో అసమానతలను పెంచింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అభద్రత, హింస, అత్యాచారాలు, అశాంతి పెరిగినట్లుగా అన్ని గణాంకాలు, నివేదికలు తెలియచేస్తున్నాయి. మహిళల విద్య, ఉపాధి, పౌష్టికతకు సంబంధించిన అంశాలలో వెనకబడుతున్నాం. ఇటువంటి దుర్భర పరిస్థితులలో ఎక్కువ మంది పిల్లల్ని కనండి అని సూచించడం ద్వారా గ్రామీణ కుటుంబాల్లో భారం మోపడం తప్ప మరోటి కాదు. పిల్లను కనడానికి సరైన ఆస్పత్రులు లేవు. పెంచడానికి సరైన భద్రత లేదు. పెంచిన తరవాత చదివించేం దుకు సరైన పాఠశాలలు లేవు. వారిని సమర్థులైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అనువైన వాతావరణం లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే మహిళలు పిల్లల్ని కనే క్రమంలో శారీరక, మానసిక మార్పులు, ఒత్తిళ్లకు లోనుకావాల్సి ఉంటుంది. వాటిని అధిగమించడానికి అవసరమైన వైద్యం ఎక్కువ శాతం మహిళలకు అందుబాటులో లేదు. మరీ ముఖ్యంగా గ్రామీణ, గిరిజన మహిళలకు ఇలాంటి సమస్య ఎక్కువ. డోలీ లేకుండా గర్భిణిని తరలించే సౌకర్యం కల్పించని పాలకులు ఇఇ గుర్తుకు రావడం లేదు. సమాజంలో మార్పులు వస్తున్నా, ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగినా ఇంకా మహిళలు అణచివేతకు గురవుతున్నారు. 21 ఏళ్లు నిండినప్పటి నుంచి మహిళల మీదపెళ్లి ఒత్తడి పెరుగుతంది. పెళ్లి అయితే పిల్లలను కనమని ఒత్తిడి కుటుంబ సభ్యుల నుంచి ఉంటుంది. ఇక ప్రోత్సాహకాలు ఇస్తున్నారంటే ఆ ఒత్తిడి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికే చాలా మంది మహిళలు కెరీర్, కుటుంబం రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవడంలో అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారు. వెనకటికి లాగా ఉమ్మడి కుటుంబాలు లేవు. నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు అందరికీ అందుబాటులో ప్రభుత్వ అజమాయిషీలో తీసుకుని రావడంపై ముందుగా పాలకలు దృష్టి సారించాలి. ఇస్తామన్న ప్రోత్సాహక డబ్బు ఇందుకోసం వెచ్చించాలి. అందరూ ఉపాధిని హక్కుగా పొందగలిగేలా పరిస్తితిని సృష్టించాలి. స్కూళ్లతో పాటు ఆటస్థలాలు, పార్కులు, సాంస్కృతిక వికాసం కోసం లైబ్రరీలు, పాటలు, డాన్సులు నేర్పే సంస్థలను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. అప్పుడు జనాభా నియంత్రణను ఎవ్వరు కూడా పాటించరు.

## సోనియా గాంధీ కంటికి శస్త్రచికిత్స.. కోలుకుని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్



**న్యూఢీల్లి : మే 30 ( మహాప్రభ )**
కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, పార్టీ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కంటికి ఇటీవల శస్త్ర చికిత్స జరిగింది. ఈ సర్జరీ నుంచి కోలుకున్న సోనియా గాంధీ తాజాగా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. న్యూఢిల్లీలోని తన నివాసమైన10 జన్‌పథ్‌కు చేరుకున్నారు.కొద్ది రోజులుగా సోనియా అనారోగ్యంపై చాలా ప్రచారం జరిగింది. ఆమెకు ఏమైంది అనే విషయంలో ఎలాంటి ప్రకటనా రాలేదు. ఇదే సమయంలో ఇటీవల న్యూఢిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో చేరినట్లు ప్రచారం జరిగింది. ఆమె తనయుడు రాహుల్ గాంధీ కూడా సోనియా గాంధీని ఆస్పత్రిలో కలిసి వచ్చారు. అయితే, సోనియా గాంధీకి కంటి ఆపరేషన్ జరిగినట్లు తాజాగా వెల్లడైంది. ఈ ఆపరేషన్ తర్వాత కొద్ది రోజులపాటు ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారు. ఆమె పూర్తిగా కోలుకున్న తర్వాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. సోనియా చాలాకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆమె లంగ్స్, శ్వాస సంబంధిత సమస్యలు, ఉదర సంబంధిత సమస్యలతో బాధపడ్డారు. ఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రి, షిమ్లాలోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, గుర్గావ్‌లోని మేదాంత ఆస్పత్రి సహా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. తాజాగా కంటికి శస్త్ర చికిత్స పూర్తైనా ఇంకొంతకాలం ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని సమాచారం.


## అభిషేక్ బెనర్జీపై గుడ్లు, రాళ్లతో దాడి.. 'చోర్ చోర్' నినాదాలు



**కోల్‌కతా: : మే 30 ( మహాప్రభ )**
పశ్చిమ బెంగాల్‌కు చెందిన టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి జరిగింది. ఎన్నికల అనంతర హింసాకాండ బాధిత కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన ఆయనపై కోడిగుడ్లు, రాళ్లు విసిరారు. 'దొంగ దొంగ' అంటూ స్థానిక బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. శనివారం సోనార్‌పూర్ ప్రాంతాన్ని అభిషేక్ బెనర్జీ సందర్శించారు. ఎన్నికల అనంతర హింసాకాండ బాధితుల కుటుంబాలను పరామర్శించేందుకు అక్కడకు చేరుకున్నారు.కాగా, స్థానికులైన బీజేపీ కార్యకర్తలు అభిషేక్ బెనర్జీని అడ్డుకున్నారు. ఆయనపై కోడిగుడ్లు, రాళ్లు విసిరారు. 'దొంగ దొంగ' అంటూ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో అభిషేక్ బెనర్జీ హెల్మెట్ ధరించగా, సెక్యూరిటీ సిబ్బంది ఆయనకు రక్షణగా నిలిచారు. మరోవైపు తనపై జరిగిన దాడికి బీజేపీనే కారణమని అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. 'ఇదంతా బీజేపీ ప్రాయోజితం. వాళ్లు ఏం చేశారో చూడండి. వాళ్ల ప్రజాస్వామ్యానికి ఉదాహరణ ఇదేనా. నెల కూడా కాలేదు. పోలీసులు ఎక్కడా కనిపించడం లేదు' అని విమర్శించారు. తన పర్యటన గురించి ముందస్తు సమాచారం అందించినప్పటికీ, తగినంత భద్రత కల్పించలేదని అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. 'పోలీసులు, భద్రతా బలగాలు ఇక్కడ భద్రత కల్పించేంత వరకు నేను ఇక్కడి నుంచి కదలబోను. వారు ఈ ఇంటిని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అంతేకాక నన్ను చంపాలని చూస్తున్నారు' అని ఆయన అన్నారు.

## ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందంపై సంతకం చేయని ట్రంప్..!

**న్యూఢీల్లి : మే 30 ( మహాప్రభ )**
పశ్చిమాసియా లో యుద్ధ సంక్షోభం ఇప్పుడప్పుడే ముగిసేలా కనబడటం లేదు. ఇరాన్ తో కాల్పుల విరమణ పొడిగింపు, హర్మూజ్ జలసంధి లో దిగ్బంధనం ఎత్తివేతకు సంబంధించిన తాత్కాలిక ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయలేదు. దాంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు మళ్లీ మొదటికి వచ్చినట్లయ్యింది. ఇరాన్ తో తాత్కాలిక ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునేందుకు శ్వేతసౌధం సిచ్యువేషన్ రూమ్‌లో ట్రంప్ తన సలహాదారులతో సమావేశమయ్యారు.దాదాపు రెండు గంటలపాటు వారు సమావేశమయ్యారు. అయినప్పటికీ ఒప్పందంపై ఎలాంటి పురోగతి లేదు. ఈ డీల్‌పై సంతకం



చేయకుండానే ట్రంప్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ పరిణామాలపై వైట్‌హౌస్ అధికారి మాట్లాడుతూ.. ఇరాన్‌తో కుదిరే ఏ ఒప్పందమైనా అది అమెరికా కు మేలు చేసేదిగా ఉండాలని, టెహ్రాన్‌పై విధించే ఆంక్షలు, నిబంధనలపై ట్రంప్ సంతృప్తి చెందాలని అన్నారు. ఆ తర్వాతే అధ్యక్షుడు డీల్‌పై సంతకం చేస్తారని ఈ సందర్భంగా ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదని పేర్కొన్నారు. మరోవైపు డీల్ విషయంపై అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తెలిపారు. ఇంకా తుది ఒప్పందం ఖరారు కాలేదన్నారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కీలక వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే ఇరాన్‌తో యుద్ధం తిరిగి ప్రారంభించే సత్తా అగ్రరాజ్యానికి ఉందన్నారు. తమ ఆయుధ నిల్వలు నిండుగా ఉన్నాయన్నారు. ఇక అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా కీలక పోస్టు పెట్టింది. పశ్చిమాసియాలో తమ దళాలు అప్రమత్తంగా ఉన్నాయని తెలిపింది. దాంతో ఏ క్షణాన ఏం జరుగుతుందో అనే ఆందోళన నెలకొంది.

## కాక్రోచ్ జనతా పార్టీకి ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు..


### చర్చలు, విబేధాలతోనే ప్రజాస్వామ్యం బలోపేతమంటూ వ్యాఖ్య

**న్యూఢీల్లి : మే 30 ( మహాప్రభ )**
ఇటీవల సంచలనం సృష్టిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి ఆర్‌ఎస్‌ఎస్ (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) మద్దతు ప్రకటించింది. దేశంలో చర్చలు, విబేధాలు, విమర్శలు ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని ఆర్‌ఎస్‌ఎస్ అభిప్రాయపడింది. ఈ మేరకు ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ అయిన సునీల్ అంబేకర్ శనివారం ఈ అంశంపై మీడియాతో మాట్లాడారు.దేశంలో కొత్తగా వస్తున్న గొంతుకలకు, భిన్నాభిప్రాయాలకు, కొత్త రాజకీయ వేదికలకు భారత దేశ ప్రజాస్వామ్యం స్థానం




కల్పించగలదన్నారు. భారత రాజకీయ సంస్కృతికి ప్రజాస్వామ్య భాగస్వామ్యం, బహిరంగ చర్చలు కీలక సాధనాలు అని సునీల్ అంబేకర్ అభిప్రాయపడ్డారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు తగిన అవకావం కల్పిస్తాయన్నారు. మీడియా, సోషల్ మీడియా కూడా ప్రజాస్వామ్యానికి అవకాశం కల్పిస్తాయని చెప్పారు. ఏ రకమైన చర్చ జరిగినా, ప్రజుల భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినా షాక్ అవ్వాల్సిన అవసరం లేదని, ఇదంతా సాధారణ ప్రక్రియలో భాగంగానే భావించాలని సునీల్ అంబేకర్ సూచించారు.దేశ యువత గురించి కూడా ఆయన స్పందించారు. జెన్ జీ దేశాన్ని ముందుకు తీసుకెళ్లగలుగుతారనే నమ్మకం ఉందన్నారు. దేశ భవిష్యత్‌ను నిర్మిస్తారని, దేశాభివృద్ధికి పాటుపడతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇక, కాక్రోచ్ జనతా పార్టీకి ఇటీవల ఆన్‌లైన్‌లో ఎలాంటి ఆదరణ లభించిందో తెలిసిందే. పార్టీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌కుమ మిలియన్ల కొద్దీ ఫాలోవర్లు వచ్చి చేరారు. మరోవైపు ఈ పార్టీ ఎక్స్ అకౌంట్‌పై కేంద్రం నిషేధం విధించింది. ఈ అంశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.సీజేపీపై విస్తృతంగా చర్చ మాత్రం జరుగుతోంది.

## కొలంబియా సమీపంలో పసిఫిక్‌లో నౌకపై అమెరికా దాడి : ముగ్గురు మృతి




**వాషింగ్టన్ : మే 30 ( మహాప్రభ )**
నార్కో టెర్రరిజం ఆరోపణలతో కొలంబియా సమీపంలోని పసిఫిక్ మహాసముద్రంలోని నౌకపై సంయుక్త సైనిక దళం దాడి జరిపింది. ఈ దాడలో మగ్గురు మృతి చెందారు అని అమెరికా దక్షిణ కమాండ్ శుక్రవారం ప్రకటించింది. ఈ వారాంతంలోనే ఇది అమెరికా సైన్యం దాడి చేయడం మూడోసారి. నార్కో టెర్రరిజాన్ని అంతమొందించడానికి ఆపరేషన్ సదరన్ స్పియర్ పేరిట అమెరికా దాడులు చేస్తోంది. ఇప్పటివరకు ఈ ఆపరేషన్ 190 మంది మీతి చెందారు. పది మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. ఈ మంగళవారం జరిపిన దాడిలో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు.

## మయన్మార్ అధ్యక్షుడు భారత్ పర్యటన

**బుద్ధగయ : మే 30 ( మహాప్రభ**
మయన్మార్ అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్ హ్లైంగ్ భారత్ పర్యటనలో భాగంగా శనివారం మొదటగా బీహార్‌లోని బోధ్‌గయాకు చేరుకున్నారు. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టు ద్వారా వెల్లడించారు.



మయన్మార్ అధ్యక్షుడిని బీహార్ విమానాశ్రయంలో ఆ రాష్ట్ర గవర్నర్, లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అత హస్నైన్ (రిటైర్డ్) ఆయనకు స్వాగతం పలికారు. ఇరు దేశాల మధ్య ఆధ్మాత్మిక, చారిత్రక, ప్రజల మధ్య సంబంధాలను ఈ పర్యటన ద్వారా మరింత బలోపేతం చేయనుంది అని రణధీర్ జైశ్వాల్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, నేడు మయన్మార్ అధ్యక్షుడు బీహార్‌లోని గయా జిల్లాలో ఉన్న బౌద్ధుల పుణ్య క్షేత్రాల్లో ఒకటైన మహాబోధి ఆలయాన్ని సందర్శించనున్నారు. ప్రధాని మోడీ ఆహ్వానం మేరకు యూ మిన్ భారత్ పర్యటన మే 30 -- జూన్ 2 వరకు కొనసాగుతుంది. యూమిన్ భారత్ పర్యటన ఇదే తొలిసారి. జూన్ 1వ తేదీన ఢిల్లీలో ప్రధాని మోడీతో ఈయన సమావేశం కానున్నారు. ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించుకోనున్నారు. జూన్ 2వ తేదీన దేశ ఆర్థిక రాజధాని ముంబైలో పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు.

# నిష్పక్షపాత విధులే పోలీసుల లక్ష్యం

**-రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం**

**-మెదక్ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పాల్గొన్న ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు..**



**మెదక్ జిల్లా -30మే (మహాప్రభ )**
ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్ సూచించారు. రాష్ట్రంలోని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశానికి మెదక్ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలని, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫిర్యాదుల స్వీకరణ నుంచి కేసుల దర్యాప్తు వరకు ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీసు శాఖపై విశ్వాసం పెంపొందించేలా పనిచేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణతో పాటు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో గస్తీ నిర్వహణ, డయల్-100 కాల్స్‌పై స్పందన, ఫిర్యాదుల పరిష్కారం, బాధితుల ఇంటి వద్దకే వెళ్లి కేసుల నమోదు వంటి అంశాలపై సమీక్షించారు. రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదుల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ జరుగుతోందని, పెండింగ్ కేసులు లేకుండా వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని ఎస్పీ సూచించారు. ప్రతి పోలీసు అధికారి ప్రజల సమస్యలపై స్పందిస్తూ అందుబాటులో ఉండాలని, విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. రాష్ట్ర పోలీసు శాఖ ప్రజాసేవల నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఫిర్యాదులు, కేసులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమయానుకూలంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల విశ్వాసమే పోలీసు శాఖకు బలమని, ఆ విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డియస్పి లు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, సీఐ లు రాజశేఖర్ రెడ్డి, మహేష్, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, ఆర్ఐ శైలందర్, ఎసై లు పాల్గొన్నారు.

## ప్రపంచ రికార్డుల విజేత బేబీ అశ్విక

# గౌడ్‌కు మంత్రుల ఘన సన్మానం









**రామాయంపేట మే 30 (మహా ప్రభ)**
చదరంగం పోటీల్లో కేవలం 8 నిమిషాల 56 సెకన్లలోనే 120 టేబుల్స్ పూర్తి చేసి సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది మూడేళ్ల చిన్నారి బేబీ అశ్విక గౌడ్. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్రం గౌడ్ మనవరాలైన అశ్విక, డైమండ్ చెస్ అకాడమీ కోచ్‌లు పల్లె అంకిత గౌడ్ మరియు దివ్యశ్రీల ప్రత్యేక శిక్షణలో ఈ అసాధారణ ప్రతిభను కనబరిచింది. ఈ అద్భుత విజయానికి గానూ ఈ చిన్నారిని ప్రతిష్టాత్మక వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ - లండన్‌తో పాటు ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ ఆఫ్ ఎక్సలెన్సీ అనే రెండు ప్రపంచ రికార్డులు వరించాయి. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో బేబీ అశ్విక గౌడ్‌కు ఘన సన్మానం జరిగింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాట్స్ చైర్మన్ వాకిటి శ్రీహరి ముదిరాజ్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కమిషన్ చైర్మన్ వడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు అశ్వికను ప్రత్యేకంగా అభినందించారు. అతి చిన్న వయస్సులోనే తెలంగాణ కీర్తి పతాకాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిన అశ్విక గౌడ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా మంత్రులు ఆకాంక్షించారు. ఇదే క్రమంలో అశ్విక అద్భుత విజయం వెనుక నిలిచిన ఆమె తల్లిదండ్రులు అక్షిత గౌడ్ - సాయి హితార్థ గౌడ్‌లతో పాటు, తాత పల్లె రామచంద్రం గౌడ్‌ను కూడా మంత్రులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

## మహిళల సమస్యల పరిష్కారానికి

# ముందడుగు జెండర్ రిసోర్స్ సెంటర్

**-డిఆర్ డిఓ పిడి శేఖర్ రెడ్డి**






**దేవరకొండ ( డివిజన్) 30మే (మహాప్రభ):**
మహిళల సాధికారికతకు కృషి చేయడమే కాకుండా వారికి ఏ సమస్య వచ్చినా అండగా నిలిచేందుకు ప్రభుత్వం జెండర్ రిసోర్స్ సెంటర్లను చేపడుతుందని డిఆర్ డిఓ పిడి శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. 99 రోజుల ప్ర ప్రణాళికలో భాగంగా ప్రజా పాలన ప్రగతి నివేదిక సందర్భంగా డిఆర్డిఏ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ( సెర్ప్ )ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుటుంబ సలహా కేంద్రం( జెండర్ రిసోర్స్ సెంటర్) ను దేవరకొండ పట్టణంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు, సమాజంలో చోటు చేసుకుంటున్న పలు ఘటనాలతో అతివలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కలత చెందడం మినహా ఎవరికి చెప్పుకోలేక వారిలో వారే కుమిలిపోయి మానసికంగా కుంగి పోతున్నారని తెలిపారు. ఇలాంటి వారందరికీ జెండర్ రిసోర్స్ సెంటర్ ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. సమాజంలోని స్త్రీలు ఎవరైనా సరే ఈ కేంద్రాన్ని ఆశ్రయించి సాయం పొందవచ్చునని అన్నారు. అన్యాయానికి గురైన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యకు పరిష్కారం లభించే విధంగా సహకారం అందిస్తారని వివరించారు. కుటుంబ సమస్యలు, మహిళల హక్కులు, లింగ వివక్ష, గృహహింస, ఆరోగ్యం, పోషకాహారం పై ఉచితంగా న్యాయ, మానసిక సలహాలు అందించడమే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశమని తెలిపారు, బాధితులు నేరుగా వచ్చి సేవలు పొందవచ్చునని సూచించారు. అలాగే 72 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన చెక్కును అందజేశారు. అనంతరం జెండర్ కమిటీ సభ్యులను, మండల సమాఖ్య ఓబీలను, వివో ఏ లను సన్మానించారు. అంతకుముందు స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి కోదాడ జడ్చర్ల జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దానియేలు, సీఐ వెంకట్ రెడ్డి, సెర్ప్ పీఎం లింగం గౌడ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, ఏపీఎం విజయలక్ష్మి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొర్ర రామ్ సింగ్ నాయక్, సిడిపిఓ చంద్రకళ, సీసీలు, జెండర్ కమిటీ సభ్యులు, వివో ఏలు, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి

**- మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పి. ఉమా**




**ఉప్పల్, మే 30 (మహా ప్రభ)**
విద్యార్థుల రహదారి భద్రత దృష్ట్యా ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పి. ఉమా తెలిపారు.ప్రతి స్కూల్ వాహనం రవాణా నిబంధనలు పాటిస్తూ సక్రమ స్థితిలో ఉండాలని సూచించారు. బస్సుల్లో ఫిట్నెస్, ఎమర్జెన్సీ డోర్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటి భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఫిట్నెస్ లేని వాహనాలను రోడ్లపై నడపడం చట్ట విరుద్ధమని హెచ్చరించారు.విద్యార్థుల భద్రత కోసం స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## ఊట్కూరు వారి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన పాశం గోపాల్ రెడ్డి



**దేవరకొండ డివిజన్ మే 29( మహాప్రభ )**
కనగల్ మండలం ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి సన్నిధిలో ఘనంగా నిర్వహించిన ఊట్కూరి పుల్లారెడ్డి కుమారుడు హర్షిత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి. వేడుకలలో మునుకుంట్ల రాజేష్ రెడ్డి, మేకల రఘుపతి రెడ్డి, చారి, విష్ణువర్ధన్ రెడ్డి, మక్కపల్లి గ్రామస్తులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన తాహసిల్దార్ సంజీవ్ కు ఘన సన్మానం.



**దేవరకొండ మే 30( మహా ప్రభ)**
దేవరకొండ పట్టణంలో నూతనంగా వచ్చిన దేవరకొండ మండలం నూతన తాహసిల్దార్ సంజీవ్ ను మర్యాదపూర్వకంగా మండల రెవెన్యూ ఆఫీసులో కలిసి బీసీ సంక్షేమ సంఘం నాయకులు శాలువతో సన్మానం చేసి మెమొంటో అందించి స్వాగత శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక వేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పలు రకాలైన భూసమస్యలు, బడుగు, బలహీన వర్గాల సమస్యలు పరిష్కరించాలని కోరారు .మీరు రావడం మాకు ఎంతో సంతోషదాయకమైనీ మా సంఘం సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని మీ సహాయ సహకారాలు కూడా ప్రజల పక్షాన సేవలు చేసే విధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షులు రెడ్డి కోటేశ్వరరావు, 13 వ వార్డు అధ్యక్షులు పున్న వెంకటేష్ నేత, ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు గరిడి విజయ భాస్కర్, బీసీ గ్రాడ్యుయేట్ నాయకులు ఎండి ఖాళీఖ్ ,మూడి అంజయ్య, పట్టణ యువజన సంఘం ఉపాధ్యక్షులు భీమగొని శివ తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమంపై ర్యాలీ

**ఏపిఎం ప్రసన్నకుమార్**




**గాంధారి, మే 30 (మహా ప్రభ)**
గాంధారి మండల కేంద్రంలో శనివారం స్వయం సహాయక సంఘాల మహిళలతో ఉల్లాస్ కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. మహిళల్లో విద్య, సమాజాభివృద్ధిలో అక్షరాస్యతపై అవగాహన పెంపొందించడానికి ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు పుష్ప రాణి, గ్రామ సంఘాల అధ్యక్షురాలు నీల శారద, వివో ఏలు లక్ష్మీదేవి, సీసీలు గౌర్రె రాములు, రాజయ్య ఇతరులు పాల్గొన్నారు.


## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలన

**-ఎంపీడీవో రాజేశ్వర్**



**గాంధారి, మే 30 (మహా ప్రభ)**
గాంధారి మండలం జువ్వాడిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మిస్తున్న ఇండ్లను ఎంపీడీవో రాజేశ్వర్ శనివారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, ఇంటి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి లబ్ధి పొందాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతవ్వ, కాంగ్రెస్ యూత్ మండల ఉపాధ్యక్షుడు వినయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్, ఇతరులు పాల్గొన్నారు.

# దేవరకొండ ఆర్టీసీ ఉద్యోగి పదవీ విరమణ సన్మాన సభ




**దేవరకొండ ( డివిజన్) 30మే (మహాప్రభ):**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ దేవరకొండ డిపోలో సుదీర్ఘ కాలం పాటు విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగి దంపతులకు డిపో సిబ్బంది, కార్మికులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సన్మాన సభలో పదవీ విరమణ పొందిన ఉద్యోగి వెంకటేశ్వర్లు - వెంకటమ్మ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సహోద్యోగులు, డిపో అధికారులు మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధిలో సదరు ఉద్యోగి అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. సుదీర్ఘ కాలం పాటు ఎలాంటి మచ్చ లేకుండా, ప్రయాణికులకు సురక్షితమైన సేవలు అందిస్తూ, తోటి సిబ్బందితో ఎంతో స్నేహపూర్వకంగా ఉంటూ ఆదర్శంగా నిలిచారని అభినందించారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత రాబోయే తరాల ఉద్యోగులకు మార్గదర్శకమని పేర్కొన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉద్యోగి మాట్లాడుతూ.. తన సుదీర్ఘ సర్వీసులో డిపో అధికారులు, తోటి కార్మిక సోదరులు అందించిన సహకారం మరువలేనిదని, సంస్థలో పనిచేయడం ఎంతో తృప్తిని ఇచ్చిందని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో డి.ఎం.విజయ కుమారి అసిస్టెంట్ డిపో మేనేజర్ పడాల సైదులు మెకానికల్ ఇంజనీర్ కృష్ణయ్య ఇంకా వారి పేర్లు రాయండి డిపో మేనేజర్, వివిధ కార్మిక సంఘాల నాయకులు, సూపర్ వైజర్లు, డిపో సిబ్బంది మరియు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, రిటైర్డ్ ఉద్యోగి శేష జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# దేవరకొండలో ఘనంగా 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక వారోత్సవాలు'

**మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ**



**దేవరకొండ ( డివిజన్) 30మే (మహాప్రభ):**
దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు హనుమాన్ నగర్‌లో "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక వారోత్సవం" కార్యక్రమాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా వార్డు కౌన్సిలర్ ముత్యాల చంద్రకళ గారి ఆధ్వర్యంలో స్థానిక మహిళలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న 'ఇందిరా మహిళా శక్తి' చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ముత్యాల చంద్రకళ మాట్లాడుతూ... ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రగతి ప్రణాళికలను అమలు చేస్తోందని, అందులో భాగంగానే మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ఈ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. వార్డులోని ప్రతి అర్హురాలైన మహిళకు ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ సంక్షేమ కార్యక్రమంలో కౌన్సిలర్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు. శ్రీమతి గౌతమి (వార్డ్ ఆఫీసర్), శ్రీ ముత్యాల రవికుమార్ యాదవ్ (ప్రముఖ నాయకులు), శ్రీ రూప్ల. ఈ కార్యక్రమంలో హనుమాన్ నగర్ వార్డుకు చెందిన మహిళలు, కాలనీ పెద్దలు మరియు వార్డు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చీరలు అందుకున్న మహిళలు ప్రభుత్వానికి, స్థానిక నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.


# పౌర్ణమి వేళ .. పల్లకీ లో దుర్గమ్మ





**పాపన్నపేట, మే 30 ( మహా ప్రభ )**
భక్తుల జయ జయ ధ్వానాలతో అరణ్యంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. శనివారం పౌర్ణమి ని పురస్కరించుకొని వనదుర్గా క్షేత్రంలో వైభవంగా పల్లకీ సేవా నిర్వహించారు. అర్చకులు శంకర్ శర్మ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజగోపురం,శివాలయం ముందుగా ఈ ఊరేగింపు కనుల పండువగా సాగింది.

# శ్రీ తిరుమల థియేటర్‌లో అర్ధరాత్రి సమయంలో భారీ అగ్నిప్రమాదం



**కరీంనగర్, మే 30 (మహా ప్రభ)**
అంబేద్కర్ స్టేడియం ఎదురుగా ఉన్న శ్రీ తిరుమల థియేటర్‌లో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సుమారు రూ. 15 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు నిర్వాహకుడు మల్లేశం తెలిపారు. ప్రమాదంలో 200 సీట్లు, ఫాల్ సీలింగ్, స్క్రీన్, సౌండ్ సిస్టమ్, ప్రొజెక్టర్ రూమ్ పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# భారతీయ జనతా పార్టీ దేవరకొండ పట్టణ శాఖ అధ్యక్షులు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో SIR కార్యచరణ సమావేశం



**దేవరకొండ మే 30( మహాప్రభ )**
భారతీయ జనతా పార్టీ దేవరకొండ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యచరణ సమావేశం ఈరోజు ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంట్ కన్వీనర్, బిజెపి దేవరకొండ మున్సిపల్ ఇంచార్జ్ శ్రీ బండారు ప్రసాద్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల విద్యాసాగర్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరును నమోదు చేయడం, తప్పులను సరిదిద్దడం, చిరునామా మార్పులు మరియు ఇతర సవరణలను సమయానికి పూర్తి చేయడంలో పార్టీ కార్యకర్తలు చురుకుగా వ్యవహరించాలని సూచించారు.
బూత్ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేసి అర్హులైన ఓటర్లందరికీ న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు.
అలాగే పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.
ఈ సమావేశంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ,సీనియర్ నాయకులు నక్క వెంకటేష్ యాదవ్,జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండాల అంజయ్య,జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు వనం జగదీశ్,నేతల వెంకటేష్ యాదవ్ , చండీశ్వర్ , రెడ్డి శంకర్, ఇడం రవికుమార్,చిలుకరాజు బిక్కు కర్నాటి వజ్రకుమార్ ,చంద్రకళ, సభావట్ లక్ష్మి, మునిని వెంకటేశ్వర్లు, అవ్వారీ చంద్రశేఖర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు

**-సూపర్వైజర్. ఎం. విజయలక్ష్మి**



**దేవరకొండ మే 30( మహాప్రభ)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ దేవరకొండ వారి ఆధ్వర్యంలో ఈరోజు దేవరకొండ- 11వ అంగన్వాడి కేంద్రం శివాజీ నగర్ లో, అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ మన పరిసరాల్లో లభించే తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగినటువంటి ఆహార పదార్థాలను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని, ముఖ్యంగా స్త్రీలు గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ పుట్టిన తర్వాత రెండు సంవత్సరాల వయసు కాలపరిమితి చాలా ముఖ్యమని మరియు ప్రాముఖ్యత గురించి తెలియజేయడం జరిగింది, అలాగే బాల్య వివాహం వలన కలిగే నష్టాల గురించి ,బాల్యవివాహాలను ప్రోత్సహించే అటువంటి వారికి విధించేటువంటి శిక్షల గురించి తెలియజేయడం జరిగింది, అమ్మ మాట-అంగన్వాడి బడిబాట కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కేంద్రం నుంచి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్నటువంటి చిన్నారులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది, అంగన్వాడి కేంద్రంలో ప్రీస్కూల్ విద్యను అభ్యసించినటువంటి చిన్నారుల యొక్క తల్లిదండ్రుల యొక్క అభిప్రాయాన్ని కూడా తెలియపరచడం జరిగింది,ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్.కె నవీద్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల నుంచి అందించేటువంటి సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ టీ పద్మావతి ఆయమ్మ ఆసియా బేగం, చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సొసైటీ లో బాధ్యతగా ఉండాలి



**పాపన్నపేట, మే 30 ( మహా ప్రభ )**
సమాజంలో శాంతిభద్రతలు నెలకొనేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా సమరస్యంగా వ్యవహరించాలని పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కోరారు. శనివారం బాచారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులు,విధులు,చట్టాల పట్ల అవగహన కల్పించారు. ఈసందర్బంగా అయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించాలని సూచించారు. సమాజంలో శాంతి,భద్రత, సామరస్యం నెలకొనేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సైబర్ నేరాలు,మహిళల భద్రత,అత్యవసర సేవల వినియోగంపై ప్రజలకు సూచనలు చేశారు. పౌరహక్కులపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఎస్ఐ వివరించారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సొంగ పవిత్ర దుర్గయ్య,ఆర్ఐ సత్తు స్వామి, రాము,గణేష్,శ్రీను,దుర్గయ్యతో పాటు యువకులు, గ్రామప్రజలు, పోలీసులు..ఆంజనేయులు,నాను, కిషన్,బస్వరాజ్,యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

# నెలరోజులుగా కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న మొక్కజొన్న రైతులు

**రైతుల కష్టాలు ఎవరు తీర్చాలి, వర్షం వస్తే బాధ, గాలి దుమానం బాధ, అధికారులు పట్టించుకోరా**




**గాంధారి, మే 30: (మహా ప్రభ)**
కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని పేట్ సంగం గ్రామ రైతులు తమ మొక్కజొన్న పంట కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో మొక్కజొన్నలను పోసి దాదాపు నెల రోజులు గడుస్తున్నప్పటికీ, ఇప్పటికీ పూర్తిస్థాయిలో కొనుగోలు ప్రక్రియ జరగడం లేదని రైతులు తెలిపారు. లారీల కొరతతో పాటు రవాణా వ్యవస్థలో జాప్యం కారణంగా కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యపై పలు మార్లు సంబంధిత అధికారులను సంప్రదించినప్పటికీ, ఎవ్వరూ సరిగ్గా స్పందించడం లేదని రైతులు వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని తెలిపారు.కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కావడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అప్పులు తీర్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే అదనపు లారీలను ఏర్పాటు చేసి, పారదర్శకంగా వేగవంతంగా మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టాలని పేట్ సంగం గ్రామ రైతులు ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను కోరుతున్నారు. రైతులకు పంట ఏస్తే ఒక బాధ, పంట ఏసిన తర్వాత ధాన్యాలు పోకపోవడం ఒక బాధ, రైతుల కష్టాలు ఎవరు తీర్చాలి, ప్రభుత్వం పట్టించుకోని అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకోవాలని గ్రామ ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# గీత కార్మికుల సమస్యలపై చర్చ





**వెల్దండ,మే 30: (మహాప్రభ)**
వెల్దండ మండల కేంద్రంలో గీత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం నాయకులు ఎక్సైజ్ సూపరిండెంట్ గాయత్రీ దేవిని, సీఐ, ఎస్సైలను కలిసి గీత కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు మట్ట వెంకటయ్య గౌడ్, సహకార సంఘం అధ్యక్షుడు మట్ట మదన్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు విష్ణు గౌడ్, కార్యదర్శి కృష్ణయ్య గౌడ్, డైరెక్టర్లు మట్ట శంకరయ్య గౌడ్, మట్ట నిరంజన్ గౌడ్ పాల్గొన్నారు. గీత కార్మికుల సమస్యలు, ఈతవనం పెంపకం, అర్హులైన కార్మికులకు పెన్షన్ల మంజూరు వంటి అంశాలపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు తెలిపారు. గీత కార్మికుల సంక్షేమానికి సహకారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

# మూడేళ్లుగా ఫిర్యాదులు.. స్పందించని విద్యుత్ శాఖ!

**-కన్మల్ లో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు ప్రమాదకరంగా కిందకు వేలాడుతూ రైతుల ఆందోళన**





**తాడ్వాయి, మే 30: (మహాప్రభ)**
మండలంలోని కన్మల్ గ్రామంలో ఎస్ఎస్-1 ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని కన్మల్ గ్రామానికి చెందిన రైతు, వెల్మ సంతోష్ రెడ్డి, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గత మూడు సంవత్సరాలుగా విద్యుత్ శాఖ అధికారులకు, ఏఈ, డీఈ లకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. టోల్‌ఫ్రీ నంబర్‌కు కూడా ఫిర్యాదు చేసినా స్పందన లేదని తెలిపారు. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులకు, కూలీలకు ఈ వైర్లు ప్రమాదకరంగా మారాయని పేర్కొన్నారు. గత ఆరు నెలల క్రితం కూడా ఈ సమస్యను పత్రికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదం జరిగినా అందుకు విద్యుత్ శాఖ అధికారులు బాధ్యత వహించాలని హెచ్చరించారు.

# బిజినెస్

## పసిడి ప్రియులకు షాక్..
# మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు..

**-తెలుగు రాష్ట్రాల్లో తులం ఎంతుందంటే..**

బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు నాన్ స్టాప్‌గా పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల రేట్లు రికార్డు స్థాయికి చేరుకుని.. ఆ తర్వాత క్రమంగా దిగివచ్చాయి.. ఈ క్రమంలోనే బంగారం, వెండి ధరలు మళ్లీ షాకిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు, డిమాండ్ నేపథ్యంలో బంగారం, వెండి ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా పెరిగిన విషయం తెలిసిందే. శుక్రవారం బంగారం ధరలు భారీగా పెరిగాయి. ఒక్కరోజే 1600 మేర ధర పెరిగింది. అయితే.. పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. శనివారం (మే 30, 2026 ) ఉదయం ఆరు గంటల వరకు నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి ధరలు స్వల్పంగా పెరిగాయి.



వెండి కిలోపై రూ.100 మేర పెరిగి.. రూ.2,80,100 గా ఉంది.

అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.

**ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..**

హైదరాబాద్‌లో గోల్డ్ 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,57,650, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,44,510 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,90,100 ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,57,650, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,44,510 ఉంది. వెండి కిలో ధర రూ.2,90,100 ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,57,650, 22 క్యారెట్ల ధర రూ.1,44,660 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,80,100 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,57,650, 22 క్యారెట్ల ధర రూ.1,44,510 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,80,100 లుగా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,59,290, 22 క్యారెట్ల ధర రూ.1,46,010 ఉంది. వెండి కిలో ధర రూ.2,90,100 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,57,650, 22 క్యారెట్ల ధర రూ.1,44,510 ఉంది. వెండి కిలో ధర రూ.2,80,100 లుగా ఉంది.

## ఇండిగో లాభాలకు ఫారెక్స్ సెగ.. క్యూ4లో రూ.2,537 కోట్ల నష్టం



**న్యూఢిల్లీ,**

దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగో లాభాలకు ఫారెక్స్ సెగ గట్టిగానే తాకింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.2,536.9 కోట్ల నష్టాలను చవిచూసింది. గడిచిన త్రైమాసికంలో సంస్థ ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నదని, ముఖ్యంగా నిర్వహణ సమస్యలు అధికం కావడం, రూపాయి తరుగుదల మొత్తం లాభాలపై ప్రతికూల ప్రభావం చూపిందని ఇండిగో పేర్కొంది.క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.3,067.5 కోట్ల లాభాన్ని గడించింది. అలాగే సమీక్ష కాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన మూడు శాతం ఎగబాకి రూ.23,830.7 కోట్లకు చేరుకున్నట్టు ఇండిగో వివరించింది.

## టెస్లా కార్లపై ఏకంగా రూ. 9 లక్షల తగ్గింపు.. ఎందుకో తెలుసా?

ప్రముఖ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లో తన మోడల్ వై కారు ధరను ఏకంగా రూ.9 లక్షల మేర భారీగా తగ్గించింది. దేశంలో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగకపోవడంతో కంపెనీ ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. భారత ఆటోమొబైల్ రంగంలో గట్టి పోటీని ఎదుర్కొనేందుకు సదరు సంస్థ తన వ్యూహాన్ని పూర్తిగా మార్చేసింది. మార్కెట్లో డిమాండ్ ఒక్కసారిగా పడిపోవడంతో ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు. వినియోగదారులను ఆకర్షించేందుకు సరికొత్త ధరలతో మార్కెట్లోకి వస్తోంది.ఈ భారీ తగ్గింపుతో మోడల్ వై ప్రారంభ ధర ఇప్పుడు ప్రీమియం కొనుగోలుదారులకు మరింత అందుబాటులోకి వచ్చింది. ధరల తగ్గింపుతో పాటు భారతదేశంలో తన కార్ల శ్రేణిని కూడా టెస్లా పునర్వ్యవస్థీకరించింది. కొత్త వేరియంట్లను ప్రవేశపెడుతూ పాత వాటి స్థానంలో మార్పులు చేసింది. గత కొన్ని నెలలుగా దేశీయ మార్కెట్లో ఈ కార్ల అమ్మకాలు చాలా మందకోడిగా సాగుతున్నాయి.



భారీ ధరల కారణంగా చాలా మంది వాహన ప్రియులు ఇతర కంపెనీల వైపు మొగ్గు చూపారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కంపెనీ యాజమాన్యం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.టెస్లా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల దేశంలోని ఇతర లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల కంపెనీలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా టాటా, మహీంద్రా వంటి స్థానిక సంస్థలతో పాటు జర్మన్ కార్ల తయారీ సంస్థలకు ఇది గట్టి పోటీని ఇస్తుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ధరల యుద్ధం ప్రారంభం కావడం వల్ల అంతిమంగా వినియోగదారులకే ఎక్కువ లాభం చేకూరనుంది. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు క్రమంగా ఆదరణ పెరుగుతున్న తరుణంలో ఈ తగ్గింపు మార్కెట్ గమనాన్ని పూర్తిగా మార్చవచ్చు.చౌక ధరలకే అత్యాధునిక సాంకేతికత కలిగిన కార్లను అందించడం ద్వారా మార్కెట్ వాటాను పెంచుకోవాలని టెస్లా యోచిస్తోంది. రానున్న రోజుల్లో షోరూమ్‌లలో బుకింగ్స్ భారీగా పెరిగే అవకాశం ఉందని డీలర్లు అంచనా వేస్తున్నారు. ఏదేమైనా అంతర్జాతీయ మార్కెట్లో అగ్రగామిగా ఉన్న సంస్థ భారత్‌లో పట్టు సాధించేందుకు ఇంతలా తగ్గడం ఇదే మొదటిసారి. ఈ కొత్త ధరలు నేటి నుంచే అమలులోకి వస్తాయని సమాచారం. మరి ఈ భారీ ఆఫర్ తో టెస్లా అనుకున్న లక్ష్యాన్ని అందుకుంటుందో లేదో చూడాలి.

# స్పోర్ట్స్

## వైభవ్ అద్భుతం.. ప్రపంచంలోనే ఉత్తమ ఆటగాడు..!

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లోవైభవ్ సూర్యవంశీ ఆటకు ఫిదా అయిపోయారంతా. ప్రత్యర్థి ఆటగాళ్లు సైతం ఏమన్న ఆడుతున్నాడా అని ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటికే 'వైభవ్ నా ఫేవరెట్ క్రికెటర్' అని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ పేర్కొనగా.. ఇప్పుడు భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సైతం మెచ్చుకున్నాడు. క్వాలిఫయర్ 2లో పదిహేనేళ్ల కుర్రాడి విధ్వంసాన్ని కళ్లారా చూసిన గిల్.. ప్రస్తుతం ప్రపంచంలోనే ఉత్తమ ఆటగాళ్లలో వైభవ్ ఒకడు అని కితాబిచ్చేశాడు.ఐపీఎల్ 19లో వైభవ్ సూర్యవంశీ మెరుపు ఇన్నింగ్స్‌లకు పలు రికార్డులు దాసోహమయ్యాయి. ప్రపంచస్థాయి బౌలర్లను ఎదుర్కొంటున్నాను? అనే భయమన్నది ఎరుగకుండా సిక్సర్ల మోతతో అలరించిన అతడి ఆటకు శుభ్‌మన్ గిల్ ఫ్యాన్ అయిపోయాడు. క్వాలిఫయర్ 2లో గుజరాత్ టైటాన్స్‌పై సీనియర్లు విఫలమైనా వైభవ్ ఎంతో ఓపికగా.. ఆపై దూకుడుగా ఆడినఇన్నింగ్స్ చూసిన గిల్ ప్రశంసించకుండా ఉండలేకపోయాడు.'ఈ సీజన్ వైభవ్‌కు గుర్తుండి పోతుందని అనుకుంటున్నా. ఇప్పటివరకూ అతడిలా ఆడే బ్యాటర్‌ను నేను చూడలేదు. ఈ క్షణం..



ప్రపంచంలోని ఉత్తమ బ్యాటర్లలో వైభవ్ ఒకడు. అతడి ఆట ఎంతో అద్భుతం. హిట్టింగ్ ఒక్కటే కాదు.. అతడిలో భయమే లేదు. అందరూ ఆకాశానికెత్తేస్తున్నా అతడు చాలా ప్రశాంతంగా మైదానంలోకి దిగి మమ్మల్ని ఒత్తిడిలో పడేశాడు. రాబోయే రోజుల్లో వైభవ్ ఆటతో ప్రత్యర్థి జట్లకు ఇబ్బందులు తప్పకపోవచ్చు' అని గిల్ పేర్కొన్నాడు. ఎలిమినేటర్‌లో పంజా విసిరిన రాజస్థాన్ రాయల్స్ క్వాలిఫయర్ 2లో తేలిపోయింది. ముల్లన్‌పూర్‌లో వైభవ్ సూర్యవంశీ(96) విధ్వంసంతో 214 రన్స్ కొట్టినా.. బౌలర్ల వైఫల్యంతో ఆ జట్టును ముంచింది. భారీ ఛేదనలో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన శుభ్‌మన్ గిల్(104) శతకంతో రెచ్చిపోగా మూడో ఫైనల్ ఆడాలనుకున్న రాజస్థాన్ కల చెదిరింది.

**పోటీలో ముగ్గురు**

పంతొమ్మిదో సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ విజేత ఎవరు? అనేది ఆసక్తి రేపుతోంది. ఎలిమినేటర్, క్వాలిఫయర్ 2లో శతకం చేజార్చుకున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 776 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ అతడికి గట్టి పోటీ ఇస్తున్నారు. రాజస్థాన్‌పై సెంచరీతో గిల్ ఏడొందల క్లబ్‌లో చేరగా.. అర్ధ శతకంతో మెరిసిన సుదర్శన్ సైతం రేసులోకి దూసుకొచ్చింది. ఐపీఎల్ ఒకే సీజన్‌లో ముగ్గురు ఆటగాళ్లు 700లకు పైగా పరుగులు సాధించడం ఇదే మొదటిసారి. దాంతో, ఈ ముగ్గురిలో ఆరెంజ్ విజేత ఎవరో ఫైనల్ మ్యాచ్‌తో తేలిపోనుంది.

## సెమీఫైనల్లో ఓటమి.. ఆసియా క్రీడలకు దూరమైన ఒలింపిక్ విజేత..!

పారిస్ ఒలింపిక్స్ అనంతరం రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికి.. ఆసియా క్రీడ లతో పునరాగమనం చేయాలనుకున్న వినేశ్ ఫొగాట్ కల చెదిరింది. భారత రెజ్లింగ్ సమాఖ్య తో పోరాడి, కోర్టు అనుమతితో ట్రయల్స్‌లో పాల్గొన్న ఆమె అనూహ్యంగా ఓటమి పాలైంది. మహిళల 53 కిలోల విభాగంలో పోటీపడి తొలి రెండు రౌండ్లలో గెలుపొందిన ఆమె కీలకమైన సెమీ ఫైనల్లో విఫలమైంది. మీనాక్షి గోయత్ చేతిలో 4-6తో పరాజయంతో ఆసియా క్రీడలకు దూరమైంది.ఈమధ్యే వీడ్కోలు నిర్ణయం వెనక్కి తీసుకున్న వినేశ్ ఫొగాట్‌కు ఆసియా క్రీడల ట్రయల్స్‌లో చుక్కెదురైంది. న్యూ ఢిల్లీలో శనివారం ఈ మెగా టోర్నీ కోసం జరిగిన రెజ్లర్ల ఎంపిక పోటీల్లో వినేశ్ ఓటమి పాలైంది. 50 కిలోల విభాగలో పోటీపడేందుకు రెజ్లింగ్ సమాఖ్య అనుమతించకపోవడంతో 53 కిలోల విభాగంలో బరిలోకి దిగిన ఆమె తొలి పోరులో జ్యోతిని 7-1తో ఓడించింది.అదే ఉత్సాహంతో క్వార్టర్ ఫైనల్లో నిషిని 5-0తో చిత్తు చేసిన వినేశ్ జోరుకు మీనాక్షి గోయత్ చెక్ పెట్టింది. కానీ, సెమీఫైనల్లో ఉడుంపట్టుతో ఒలింపిక్ విజేతను రెండు పాయింట్ల(4-6) తేడాతో ఓడించింది మీనాక్షి. దాంతో, ఏడాది జపాన్‌లో జరుగనున్న ఆసియా క్రీడల్లో కుస్తీ పట్టాలనుకున్న




వినేశ్‌కు నిరాశే మిగిలింది. సెమీస్‌లో ఓటమిపై స్పందించిన వినేశ్ 'నేను మళ్లీ వస్తాను' అని పేర్కొంది.

**క్వార్టర్స్‌లో రగడ**

వినేశ్ -- నిషి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ నాటకీయంగా సాగింది. తొలి మూడు నిమిషాల్లో 0-5తో వెనుకంజలో ఉన్న వినేశ్.. గొప్పగా పుంజుకొని నిషిని పడగొట్టింది. సరిగ్గా ఆ సమయంలోనే రిఫరీ విజిల్ వేసి.. నాలుగు పాయింట్లు కేటాయించాడు. అయితే.. అతడి నిర్ణయాన్ని వినేశ్ సవాల్ చేసి రివ్యూ గెలిచింది. ఆమె భర్త సోమ్‌వీర్ రథీ కూడా నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు.

చివరకు 7-6తో ఆసియా క్రీడలకు అర్హత సాధిస్తుందనుకున్న వినేశ్ ఆశలపై సెమీస్ ప్రత్యర్థి మీనాక్షి నీళ్లు చల్లింది. ఫైనల్లో మీనాక్షిని 3-2తో ఓడించిన అంతిమ్ పంగాల్ ఆసియా క్రీడల 53 కిలోల విభాగంలో ఎంపికైంది.

## వరల్డ్ నంబర్ 1ను మట్టికరిపించి.. ఫైనల్లో సాత్విక్ -- చిరాగ్..!




ప్రతిష్ఠాత్మక సింగపూర్ ఓపెన్‌లో భారత ద్వయం సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి జైత్రయాత్ర కొనసాగుతోంది. పురుషుల డబుల్స్‌లో తిరుగులేని ఆటతో ప్రత్యర్థులకు చెక్ పెడుతున్న ఈ జోడీ దర్జాగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీ ఫైనల్లో వరల్డ్ నంబర్ 1 జోడీని మట్టికరిపించిన సాత్విక్ చిరాగ్ జంట టైటిల్ పోరుకు అర్హత సాధించింది. తద్వారా భారత్‌కు పతకం ఖరారు చేసింది.సింగపూర్ ఓపెన్ సూపర్ 750లో సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ద్వయం పంజా విసిరింది. పీవీ సింధు, లక్ష్యసేన్ తేలిపోయిన చోట దేశానికి పతకం ఖాయం చేస్తూ ఫైనల్ బెర్తు పట్టేసింది. ప్రపంచ నంబర్ 1 కిమ్ వాన్ హెూ -- సియో సెయంగ్ జీ(దక్షిణ కొరియా) జంటను చిత్తుగా ఓడించిన ఈ ద్వయం ఫైనల్లో అడుగు పెట్టింది.

**52 నిమిషాల్లోనే**

శనివారం హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్లో భారత జోడీ టాప్ గేర్‌లో ఆడింది. వరసగా రెండు సెట్లలో కొరియా జంటకు ముచ్చెమటలు పట్టించిన భారత ద్వయం 21-19, 21-18తో జయభేరి మోగించింది. కేవలం 52 నిమిషాల్లోనే ప్రత్యర్థిని కంగుతినిపించి కిమ్ -- సియోపై తొలి విజయం నమోదు చేసింది. ఫజర్ అల్ఫియాన్ -- ముహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ(ఇండోనేషియా) లేదా లియాంగ్ వీ కెంగ్ -- వాంగ్ ఛాంగ్ జంటలో ఒకరిని ఆదివారం జరుగనున్న టైటిల్ పోరులో సాత్విక్ -- చిరాగ్ ద్వయం ఢీ కొట్టనుంది.



## రాశి ఖన్నా గ్లామరస్ పిక్స్ వైరల్.

# పులి-మేకతో రోజా రీ ఎంట్రీ




సీనియర్ నటి, ఫైర్ బ్రాండ్ రోజా సెల్వమణి ఒకప్పుడు తెలుగు, తమిళ్ ఇండస్ట్రీలలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రోజా.. రాజకీయాల్లోకి వచ్చాకా సినిమాలు తగ్గించారు. ఇక తాజాగా రోజా తమిళ్ సినిమాలో రీఎంట్రీ ఇచ్చారు. దాదాపు 12 ఏళ్ళ తరువాత ఆమె నటిస్తోన్న చిత్రం లెనిన్ పాండియన్. ఈ సినిమా తెలుగులో పులి మేక అనే పేరుతో రిలీజ్ కానుంది. డి.డి. బాలచంద్రన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించారు. ఈ చిత్రంలో గంగై అమరన్, దర్శన్ గణెళిశన్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే పులి మేక చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం గ్రామీణ నేపథ్యం, రాజకీయాలు, మరియు పోలీసు వ్యవస్థ చుట్టూ తిరిగే ఒక పవర్‌ఫుల్ సామాజిక డ్రామాగా రూపొందింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఒక సామాన్య రైతు స్వేచ్ఛగా జీవించలేకపోతున్నాడనే బలమైన సంభాషణతో ఈ ట్రైలర్ మొదలయ్యింది. ఇంకోపక్క కానిస్టేబుల్ గా హీరో ఎన్ని అవమానాలు పడుతున్నాడో చూపించారు. పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుళ్లపై జరిగే అణిచివేత, ఉన్నతాధికారుల అహంకారం, మరియు మట్టి మాఫియా వల్ల గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. చట్టం, న్యాయం, మరియు అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా జరిగే పోరాటమే ఈ సినిమా కథగా తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రోజా ఒక వయస్సు మళ్ళిన మహిళగా కనిపించారు. మరి ఈ చిత్రంతో రోజా రీఎంట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి.

# క్యూట్‌నెస్‌తో మతిపోగొడుతున్న దీపిక పిల్లి

సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ఈ తరం యువతకు సరికొత్త అవకాశాలను తెచ్చిపెడుతున్నాయి. కేవలం తమలోని టాలెంట్‌తో డిజిటల్ దునియాను ఏలి, ఆ తర్వాత వెండితెర, బుల్లితెరలపై స్టార్‌లుగా మారిన వారు చాలా మంది ఉన్నారు. ఆ కోవలోకే వస్తుంది అందాల యాంకర్ దీపిక పిల్లి . టిక్‌టాక్ వీడియోలతో కెరీర్ ప్రారంభించి, ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ యాంకర్‌లలో ఒకరిగా, నటిగా ఈ బ్యూటీ దూసుకుపోతోంది.దీపిక పిల్లి మొదట టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా విపరీతమైన పాపులారిటీని సంపాదించుకుంది. ముఖ్యంగా తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, చలాకీతనం , డాన్స్ వీడియోలతో లక్షలాది మంది ఫాలోవర్లను సొంతం చేసుకుంది. సోషల్ మీడియాలో ఆమెకు ఉన్న ఈ విపరీతమైన క్రేజ్ బుల్లితెర మేకర్స్ దృష్టిని ఆకర్షించింది. దాంతో ప్రముఖ డ్యాన్స్ రియాలిటీ షో 'ఢీ'లో ఒక టీమ్ లీడర్‌గా వ్యవహరించే గోల్డెన్ ఛాన్స్ దక్కించుకుంది. ఈ షోతో దీపిక పిల్లి అనే పేరు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి ఇంట్లోనూ మార్మోగిపోయింది.కేవలం బుల్లితెర షోలకు మాత్రమే పరిమితం కాకుండా, దీపిక పిల్లి తన గ్లామరస్ ఫోటోషూట్‌లతో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. దీపిక పిల్లి షేర్ చేసే సరికొత్త లుక్స్, స్టన్నింగ్ ఫోటోలు సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతుంటాయి. అటు మోడరన్ వెస్ట్రన్ దుస్తులలోనైనా, ఇటు పద్ధతైన సాంప్రదాయ చీరకట్టులోనైనా ఆమె చూపించే వేరియేషన్స్ అభిమానులను ఎంతగానో కట్టిపడేస్తాయి. క్యూట్‌నెస్ , గ్లామర్ కలగలిపిన ఆమె ఫోటోలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటూ ఉంటాయి.యాంకర్‌గా 'కామెడీ స్టార్స్', 'ఢీ' మరియు జెమిని టీవీలోని 'మాస్ జాతర' వంటి పలు పాపులర్ షోలతో బిజీగా ఉంటూనే, సినిమా ఇండస్ట్రీలోనూ ఈ ముద్దుగుమ్మ అడుగుపెట్టింది. అల్లరి నరేష్ నటించిన 'బంగారు బుల్లోడు' చిత్రంతో వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత ప్రదీప్ మాచిరాజు, వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రల్లో వచ్చిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' లాంటి సినిమాల్లో నటిగా మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలను పోషించింది.చలన చిత్ర పరిశ్రమకు వచ్చిన అతి తక్కువ కాలంలోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్న దీపిక పిల్లి, రాబోయే రోజుల్లో మరిన్ని పెద్ద ప్రాజెక్టులతో టాలీవుడ్‌లో మరింత స్టార్‌డమ్ సొంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. అయితే కొన్నాళ్లుగా బుల్లితెరపై సైలెంట్ అయిన ఈ అమ్మడు ఇప్పుడు బ్లూ డ్రెస్‌లో క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో అదరగొడుతున్న ఫోటోస్ షేర్ చేసి ఒక్కసారిగా హాట్ టాపిక్ అయ్యింది. చూపుల్తోనే మాయ చేస్తోంది, బుల్లితెర బుట్టబొమ్మ, క్యూట్‌నెస్ ఓవర్‌లోడెడ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్.




# ఈ అభిమానం ఇలాగే ఉండాలి



శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్.ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి' అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.

# రికార్డులు తిరగరాస్తున్న కరుప్పు

## 300 కోట్ల వసూళ్లను దాటిన మూవీ




తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. టాలెంటెడ్ దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. డివైన్ ఎలిమెంట్స్, కమర్షియల్ అంశాలు, భావోద్వేగాలతో రూపొందిన ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. 'కరుప్పు' కథలోని ఆధ్యాత్మిక నేపథ్యం, భారీ స్థాయి విజువల్ ట్రీట్, కమర్షియల్ ఎలిమెంట్స్ సమతుల్యత సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. ప్రేక్షకులను ఆరంభం నుంచి క్లైమాక్స్ వరకు ఆసక్తిగా కట్టిపడేసే విధంగా దర్శకుడు ఆర్జే బాలాజీ కథను తెరకెక్కించారని సినీ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.రూ.300 కోట్ల మార్క్‌ను దాటిన 'కరుప్పు' ఇప్పుడు మరిన్ని వసూళ్ల రికార్డులపై కన్నేసింది. తమిళ సినీ పరిశ్రమలో కూడా 'కరుప్పు' ఒక ప్రత్యేక విజయగాథగా నిలిచేలా కనిపిస్తోంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com